ప్రజాశక్తి

సోమవారం 21 ఏప్రిల్ 2025 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా

కొరవడిన పర్యవేక్షణ

- పిఎన్ బస్‌స్టేషన్ నిర్వహణ అస్తవ్యస్తం
- దొంగలు, బ్లేడ్‌బ్యాచ్ స్వైరవిహారం
- డ్రైనేజీ వ్యవస్థ అధ్వానం
- ప్రైవేటు ట్రావెల్స్, కార్లు, ఆటోలతో ఆదాయానికి గండి
- మామూళ్ల మత్తులో అధికారులు

ప్రజాశక్తి-విజయవాడ

రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే పేరెన్నికగన్న విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ నిర్వహణ అధ్వాన్నంగా తయారవుతోంది. అస్తవ్యస్త పర్యవేక్షణతో బస్‌స్టేషన్ పూర్వవైభవం కోల్పోతోంది. దీంతో బస్టాండ్ లోపల, వెలుపల గందరగోళంగా తయారైంది. మరీ ముఖ్యంగా ఎపిఎస్‌ఆర్‌టిసి ప్రభుత్వంలో విలీనం అనంతరం సంస్థ మనుగడ, దాని పర్యవేక్షణపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. రోజుకు లక్ష మందికి పైగా ప్రయాణికులు ఇక్కడ నుంచి రాకపోకలు జరుపుతుంటారు. వందల సర్వీసులు ఇక్కడ నుంచే బయలుదేరుతుంటాయి. కోట్ల రూపాయలు రాబడి వస్తుంటుంది. పిఎన్ బస్‌స్టేషన్ బిల్డింగ్‌లోనే పదికి పైగా ఆయా శాఖలకు చెందిన రాష్ట్రస్థాయి కార్యాలయాలు నడుస్తున్నాయి. ఒక రకమైన 'మినీ సచివాలయం' స్థాయిలో ఇక్కడ వాతావరణం ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యత, ప్రాముఖ్యత కల్గిన ఆర్టీసి బస్టాండ్ నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైందని స్వయంగా సంస్థలోని పలువురు ఉద్యోగులే చెబుతున్నారు.

పిఎన్ బస్‌స్టేషన్ నిర్వహణను ఆర్టీసి యాజమాన్యం పూర్తిగా విస్మరించింది. బస్‌స్టేషన్ నిర్వహణకు అవసరమైన నిధులు దగ్గర నుంచి సెక్యూరిటీ, శానిటేషన్, బస్సుల పార్కింగ్, దెబ్బతిన్న ఫ్లోరింగ్ ఇలా అనేక రకాల సమస్యలతో బస్‌స్టేషన్ నిర్వహణ ఇబ్బందిగా తయారైంది. సురక్షితం అనేది ఇక్కడ మచ్చుకైనా కనిపించదు. కనీసంగా ఎండల్లో సుదూరు ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు కొద్ది సేపు సేద తీర్చుకుందామని కూర్చోవడానికి కూడా కుర్చీలు లేవు. ఎరైవల్ (మిగతా 2లో)

ఉమ్మడి కృష్ణాలో 1,213 పోస్టులు

- ఎట్టకేలకు మెగా డిఎస్‌సి నోటిఫికేషన్
- మే 15 వరకు దరఖాస్తులకు అవకాశం



ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

ఎట్టకేలకు తొమ్మిది నెలల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం మెగా డిఎస్‌సికి ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ప్రకారం ఉమ్మడి కృష్ణాజిల్లాలో 1,213 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తారు. పాఠశాల విద్యాశాఖ పరిధిలో 1208, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల విభాగంలో 5 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. ఈ పోస్టులకు ఏప్రిల్ 20వ తేదీ ఆదివారం నుంచి మే 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం కల్పించింది. జూన్ ఆరో తేదీ నుంచి జులై ఆరో తేదీ వరకు సిబిటి విధానంలో పరీక్షలు నిర్వహిస్తారు.

పాఠశాల విద్యాశాఖ పరిధిలో కృష్ణాజిల్లాలోని జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో లాంగ్వేజి 1 (తెలుగు) 39, హిందీ 25, ఇంగ్లీషు 93, గణితం 52, ఫిజికల్ సైన్స్ 54, బయాలజీ 142, సోషల్ 135, ఫిజికల్ ఎడ్యుకేషన్(పిఇటి) 123, సెకండరీ గ్రేడ్ (ఎస్‌జిటి) టీచర్ల 545 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసింది. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఎస్ఎ ఇంగ్లీషు 1, ఎస్ఎ భౌతికశాస్త్రం 1, ఎస్ఎ జీవశాస్త్రం 1, ఎస్‌జిటి ఖాళీలు 2 భర్తీ చేయనున్నారు.

డిఎస్‌సి కోసం సుదీర్ఘంగా ఎదురుచూపులు

సార్వత్రిక ఎన్నికలకు కొద్ది రోజుల ముందు గత ప్రభుత్వం 279 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చింది. లోప భూయిష్టంగా నోటిఫికేషన్ ఇవ్వడంతో కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు నోటిఫికేషన్‌ను నిలిపివేసింది. సార్వత్రిక ఎన్నికల్లోనూ డిఎస్‌సిపై హామీ ఇచ్చారు. అవనిగడ్డ, పామర్రు తదితర ప్రాంతాల్లోని డిఎస్‌సి కోచింగ్ సెంటర్‌లలో వేలాది మంది సుదర్ఘీకాలంగా శిక్షణ పొందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డిఎస్‌సిపై మొదటి సంతకం చేసింది. అయితే వివిధ కారణాలను చూపుతూ తొమ్మిది నెలలుగా నోటిఫికేషన్ విడుదల చేయకుండా జాప్యం చేసింది. తాజాగా నోటిఫికేషన్ విడుదల చేయడంతో అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటున్నారు.

కేన్సర్ ఇనిస్టిట్యూట్ శంకుస్థాపన సందర్భంగా జ్యోతిప్రజ్వలన చేస్తున్న పురంధేశ్వరి

కేన్సర్ చికిత్సలో విప్లవాత్మక ఆవిష్కరణలు

- రాజమండ్రి ఎంపి పురంధేశ్వరి
- సిటిజెన్ ఫోర్స్ కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు శంకుస్థాపన
- కేన్సర్ క్లినిక్‌ను ప్రారంభించిన మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ

కేన్సర్ చికిత్సల్లో విప్లవాత్మక ఆవిష్కరణలు వెలుగు చూస్తున్నాయని, అత్యాధునిక వైద్య సేవలు ప్రజలందరికీ అందుబాటులోకి రావాలని రాజమండ్రి ఎంపి, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. కృష్ణాజిల్లా ముళ్లపూడిలో నిర్మించబడుతున్న సిటిజెన్ ఫోర్స్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు ఆదివారం ఆమె వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. పటమట కృష్ణవేణి స్కూల్ రోడ్డులోని సిటిజెన్ ఫోర్స్ కార్యాలయం వేదికగా జరిగిన కార్యక్రమంలో ఎంపి పురంధేశ్వరి ప్రసంగిస్తూ (మిగతా 2లో)

గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు

- జెజెఎం ప్రాజెక్టు సమగ్ర నివేదిక పూర్తి
- గ్రామీణ నీటి సరఫరా విభాగ అధికారి నటరాజ్

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

గ్రామీణ ప్రాంతాల్లో వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగ అధికారి వి.డి.ఎన్.నటరాజ్ తెలిపారు. గ్రామ పంచాయతీల్లోని చెరువులను పూర్తిస్థాయిలో నింపుతున్నామని వివరించారు. జలజీవన్ మిషన్ (జెజెఎం) ప్రాజెక్టు సమగ్ర నివేదిక పూర్తయిందని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా త్వరలోనే టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో నటరాజ్ చెప్పారు.

ప్రశ్న: చెరువులు నింపడానికి ఎటువంటి చర్యలు తీసుకున్నారు?

జవాబు: వేసవి నీటి ఎద్దడి నివారణకు ముందుగానే ప్రణాళికలు రూపొందించాం. దీనిలో భాగంగా ప్రస్తుతం జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో 266 చెరువులు, 18 సామూహిక రక్షిత నీటి పథకాలును నింపడానికి 373.64 మిలియన్ కెవి ఫీట్ నీరు అవసరం అవుతుందని గుర్తించి నివేదిక అందించాం. దీని ఆధారంగా ఈనెల 10వ తేదీ నుంచి జలవనరులశాఖ ప్రకాశం బ్యారేజీ నుండి జిల్లాలోని కృష్ణా తూర్పు కాలువ, బందరు కాలువ, రైవస్ కాలువలకు నీరు విడుదల చేస్తోంది. నెలాఖరు వరకు కాలువలు ద్వారా నీరు సరఫరా అవుతుంది. ఇతర శాఖల అధికారుల సమన్వయంతో ఈ చెరువులను పూర్తిస్థాయిలో నింపుతున్నాం. మచిలీపట్నం, కృత్తివెన్ను, బంటుమిల్లి, కోడూరు, నాగాయలంక, అవనిగడ్డ తదితర సముద్ర తీర ప్రాంత మండలాల్లోని శివారు గ్రామాల్లోని 75 చెరువులను నింపడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. విద్యుత్ మోటర్లు, ఆయిల్ ఇంజన్లు ఉపయోగించి చెరువులను పూర్తిస్థాయిలో నింపుతున్నాం.

ప్రశ్న: గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రమైన నీరు సరఫరాకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: రక్షిత నీటి పథకాలను గ్రామ పంచాయతీలు పర్యవేక్షిస్తాయి. వారికి అవసరమైన సహాయ, సహకారాలను శాఖ పరంగా అందిస్తాం. సామూహిక రక్షిత పథకాలను జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షిస్తోంది. రెగ్యులర్‌గా ఓవర్ హెడ్ ట్యాంకుల క్లీనింగ్ జరుగుతుంది. వాటర్ క్లోరినైజేషన్ తర్వాతే పథకాల ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. ప్రభుత్వ నిధులతో గుడివాడ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పిల్టర్‌బెడ్‌లు నూతనంగా ఏర్పాటు చేశాం.

ప్రశ్న: జలజీవన్ మిషన్ సమగ్ర నివేదిక పూర్తయిందా?

జవాబు: కన్సల్టెన్సీ సంస్థ సమగ్ర నివేదికను (డిపిఆర్) పూర్తి చేసింది. విజయవాడ సమీపంలోని సూరాయిపాలెం వద్ద నుంచి కృష్ణాజలాలను నేరుగా గ్రామ (మిగతా 2లో)

అన్ని పంటలకు బోనస్ ప్రకటించాలి

ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు

ప్రజాశక్తి-మొవ్వ: పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల పాలవుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన అన్ని రకాల పంటలకు బోనస్ ప్రకటించి రైతులను, కౌలు రైతులను ఆదుకోవాలని ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు డిమాండ్ చేశారు. ఎపి రైతు సంఘం, ఎపి కౌలు రైతు సంఘం మొవ్వ, పామర్రు మండలాల జనరల్ బాడీ సమావేశం చినమొత్తేవి గ్రామంలోని అజయ్ భవన్‌లో ఆదివారం జరిగింది. సమావేశానికి బొల్లా సుబ్రహ్మణ్యం అధ్యక్షతన వహించగా హరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం పది నెలలు గడుస్తున్నా ఇంతవరకు కౌలు దారులకు చట్టం రూపొందించలేదని వెంటనే కౌలుదారు చట్టం రూపొందించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, అన్నదాత, సుఖీభవ, పంటల భీమా పథకం అమలు చేయాలని కోరారు. వీటి గురించి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి జూన్ నెలలో విజయవాడలో పెద్ద ఎత్తున నిరసన చేపడతామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శీలం నారాయణరావు మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికి వంద రోజులు పని కల్పించాలని, ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఉపాధి కార్మికులకు రోజుకు 600 రూపాయలు వేతనం ఇవ్వాలని, రెండు వందల రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. గత మార్చి 31లోపు పని చేసిన ఉపాధి కార్మికులకు రావాల్సిన ఎనిమిది వారాల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి కార్మికుల సమస్యలను తెలుసుకునేందుకు ఈ నెల 21 నుంచి 26 వరకు జిల్లాలో అన్ని గ్రామాల్లో పర్యటించనున్నట్లు తెలిపారు. మే 5న జిల్లాలో ఉన్న ఉపాధి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వద్ద జరిగే నిరసనలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పంచకల రంగారావు, నాయకులు వడ్డీ వెంకటేశ్వరరావు, వి బసవ శంకరరావు, జొన్నలగడ్డ భాస్కరరావు, కొడాలి కరుణాకర్, కొడాలి శ్రీనివాసరావు, కొనకళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు

మొదటిపేజీ తరువాయి

కేన్సర్ చికిత్సలో విప్లవాత్మక ఆవిష్కరణలు

ప్రజలకు మెరుగైన కేన్సర్ చికిత్సలందించేందుకు సిటిజెన్ ఫోర్స్ స్వచ్ఛంద సంస్థ ముందుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. పేద ప్రజలకు కేన్సర్ చికిత్సలందించడంలో సిటిజెన్ ఫోర్స్ మార్గదర్శిగా నిలవాలన్నారు. సేవా దక్పథంతో సిటిజెన్ ఫోర్స్ కేన్సర్ వైద్య సంస్థకు రూపకల్పన చేసిన పి.రమేష్‌బాబు, తట్టి అర్జునరావులకు అభినందనలుత తెలిపారు. వైద్య రంగంలో సేవా దృక్పథం వృద్ధి చెందాలని, నూతన ఆవిష్కరణలను అందిపుచ్చుకుని ప్రజలకు మరింత మెరుగ్గా సేవలందించాలని పిలుపునిచ్చారు. దేశ ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలను అమలు చేస్తున్నాయని చెప్పారు. రాబోయే మూడేళ్లలో అన్ని జిల్లా ఆసుపత్రుల్లో డే కేర్ కేన్సర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని కేంద్రం యోచిస్తోందన్నారు. కేన్సర్ తదితర అరుదైన వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సకు ఉపయోగించే వివిధ ఔషధాలను ప్రాథమిక కస్టమ్స్ సుంకం నుండి పూర్తిగా మినహాయించారని చెప్పారు. సిటిజెన్ ఫోర్స్ కేన్సర్ క్లినిక్‌ను రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ప్రారంభించి మాట్లాడుతూ పేద ప్రజలకు అత్యున్నత శ్రేణి కేన్సర్ వైద్య సేవలను అందించేందుకు సిటిజెన్ ఫోర్స్ ముందుకురావడం అభినందనీయమని కొనియాడారు. సిటిజెన్ ఫోర్స్ మేనేజింగ్ డైరెక్టర్ పి.రమేష్ బాబు మాట్లాడుతూ పేద ప్రజల కోసం స్వచ్ఛందంగా కేన్సర్ వైద్య చికిత్సలు అందించాలనే లక్ష్యంతో ఈ హాస్పిటల్‌ను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా పూర్తి సేవాభావంతో పేద ప్రజల పాలిట సంజీవనిగా సిటిజెన్ ఫోర్స్ హాస్పిటల్ సేవలందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్‌రావు, వర్ల కుమార్ రాజా, బీజేపీ ఏపీ మీడియా ఇంచార్జి పాతూరి నాగభూషణం, టీడీపీ నేత బొప్పన భవకుమార్, కార్పొరేటర్లు చెన్నుపాటి క్రాంతిశ్రీ, దేవినేని అపర్ణ, సిటిజెన్ ఫోర్స్ ప్రతినిధులు డాక్టర్ లలిత, డాక్టర్ కె.వంశీకృష్ణ, డాక్టర్ కె. సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు

పంచాయతీలకు సరఫరా చేయడానికి ప్రణాళిక రూపొందించింది. దీనికి రూ.5,9447 కోట్లతో డిపిఆర్ రూపొందించింది. టెండర్లు ఆహ్వానం, కాంట్రాక్టు సంస్థల అగ్రిమెంట్ పూర్తయిన తర్వాత పనులు మొదలవుతాయి. జలజీవన్ మిషన్‌లో గత పనులకు సంబంధించి రూ.135 కోట్ల విలువైన 455 వర్కులు కొనసాగుతున్నాయి. 406 వర్కులు పూర్తి చేశాం. 35 వర్కులు పురోగతిలో ఉన్నాయి.

నేడు అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ప్రజలు తమ ఫిర్యాదులను దరఖాస్తు చేసుకొని అధికారులకు అందించవచ్చని తెలిపారు. నగర ప్రజలందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

రిసోర్స్ పర్సన్లు సంఘటితం కావాలి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : మెప్మాలో రిసోర్స్ పర్సన్‌గా పనిచేసే మహిళలు సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందని కృష్ణాజిల్లా కన్వీనర్ ఝాన్సీ అన్నారు. ఆదివారం బుట్టాయిపేట సిఐటియు కార్యాలయం వద్ద ఆర్పీల సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఝాన్సీ మాట్లాడారు. సమావేశం అనంతరం పది మందితో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గ్యాస్ లీకై ఎగిసిన మంటలు

పెనుగంచిప్రోలు ఆలయంలో తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-వత్సవాయి

పెనుగంచిప్రోలులో శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి అమ్మవారి ఆలయం వద్ద యాత్రికులు ఆదివారం వంట చేస్తుండగా గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ఘటనలో ఎటువంటి నష్టమూ జరగకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఖమ్మం జిల్లా వెల్లిజర్ల గ్రామానికి చెందిన యాత్రికులు స్థానిక లక్ష్మీ తిరుపతమ్మ తల్లి అమ్మవారి ఆలయానికి మొక్కుబడులు చెల్లించేందుకు వచ్చారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ వేదిక వద్ద ఉన్న చెట్టు కింద బోనాలు సిద్ధం చేసుకునేందుకు తమతో పాటు తీసుకువచ్చిన మినీ గ్యాస్ బండపై వంట చేస్తుండగా ఒక్కసారిగా గ్యాస్ లీకై పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో ఆందోళన చెందిన యాత్రికులు గ్యాస్ బండను వదిలేసి పారిపోయారు. అక్కడే ఉన్న హోంగార్డులు వెంటనే స్పందించి స్థానికులతో కలిసి నీళ్లలో పడవేశారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఆలయ అధికారులు స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో పక్కనే సుమారు తాటాకులతో వేసిన వందకు పైగా పాకలు ఉన్నాయి. అదే ప్రమాదం తాటాకు పాకంలో గనుక జరిగి ఉంటే భారీ ప్రమాదమే జరిగి ఉండేదని స్థానికులు తెలుపుతున్నారు. గతంలో ఇదే మాదిరిగా వంట చేస్తుండగా గ్యాస్ లీకై పాకలు దగ్ధమయ్యాయి. ఇప్పటికైనా ఆలయం వద్ద ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని యాత్రికులు కోరుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

బ్లాక్‌లో ఉన్న కొద్దిపాటి కుర్చీలను మరమ్మతుల పేరుతో మూలన పడేశారు. వాటి మరమ్మతులకు నిధులు లేవనే సాకుతో ఏళ్ల తరబడి అలాగే తుప్పు పట్టిపోతున్నా పట్టించుకునే అధికారే లేరు. ఎరైవల్ బ్లాక్, డిపార్చర్ బ్లాక్‌లో పాడైపోయిన ఫ్యాన్లు బాగు చేసే దిక్కులేకుండా పోయింది. కుక్కలు, పందులు, ఆవులకు ఆవాసంగా మారింది. దొంగలు, బ్లేడ్ బ్యాచ్‌క రాత్రి సమయాల్లో ప్రయాణికులపై రెచ్చిపోతున్నారు. విశాఖ ఏజెన్సీ, ఆపైన ఒరిస్సా ప్రాంతం నుంచి విజయవాడ పరిసర ప్రాంతాలకు సరఫరా అవుతున్న గంజాయి వంటి మత్తు మందుకు బస్టాండ్, దాని పరిసర ప్రాంతాలు దిగుమతికి నిలయంగా మారిందనే చర్చ లేకపోలేదు. ప్రయివేటు ట్రావెల్స్, కార్లు, ఆటోలు వందల సంఖ్యలో బస్టాండ్‌ను చుట్టుముట్టి ఇష్టారాజ్యంగా ప్రయాణికులను తరలించుకుపోతున్నా సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శ బాహాటంగానే వినిపిస్తుంది. మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నత స్థాయి అధికారుల అండదండలతోనే ప్రయివేటు ట్రావెల్స్, ఇతర ప్రయివేటు వాహనాల యాజమాన్యం రెచ్చిపోతున్నా నివారించే పరిస్థితి లేకుండా పోయింది. ట్రావెల్స్‌కు సంబంధించిన ఏజెంట్లు, డ్రైవర్లు బస్‌స్టేషన్ ఆవరణలోకి వచ్చి ప్రయాణికులను తరలించుకుపోతూ ఆర్టీసి రాబడికి భారీ మొత్తంలో గండికొతున్నారు. బస్టాండ్ చుట్టూతా ఉన్న డ్రైనేజీ క్లీనింగ్ లేక కంపుకొడ్తున్నాయి. శానిటేషన్ అధ్వానంగా తయారైంది. ఎరైవల్ బ్లాక్ చీకటి మయంగా ఉండటంతో గబ్బిలాల సందడి పెరిగిపోయింది. చుట్టూతా ప్రహరీ లేక, మరీ ముఖ్యంగా సెక్యూరిటీ సిబ్బంది లేకపోవడం, ఉన్న పోలీసు సిబ్బంది కూడా మొక్కుబడిగా ఉండటంతో ఆటోలు, ద్విచక్రవాహనాలు, చివరకు కార్లు కూడా బస్టాండ్ లోపలకు యథేచ్ఛగా ప్రవేశిస్తూ ప్రయాణికులకు ఇబ్బందిగా తయారైంది. పెరిగిపోతున్న సర్వీసుల సంఖ్యకనుగుణంగా ప్లాట్‌ఫారమ్స్ లేక, ఒక సర్వీసు వెనుకాల మరొక సర్వీసును డ్రైవర్లు పార్కింగ్ చేయాల్సి వస్తుండటంతో రాత్రి సమయాల్లో హైదరాబాద్ సెక్టార్‌లో ప్రయాణికులు వారు ఎక్కాల్సిన సర్వీసు కనిపించక గుర్తించడంలో ఇబ్బందులుపడుతున్నారు. ఇప్పటికైనా నిధులు సమకూర్చి, సెక్యూరిటీ, నిఘా పెంచి బస్టాండ్‌ను అభివృద్ధి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చైర్మన్ పీఠం ఎవరికి దక్కేనో..?

జగ్గయ్యపేట ఎఎంసిపై ఆశావహుల్లో పోటీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

జగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఎఎంసి) చైర్మన్ ఇప్పటి వరకు ఎస్సీ రిజర్వేషన్ కేటాయించిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ రిజర్వేషన్‌లో భాగంగా ఎస్సీ మహిళకు కేటాయించడం జరిగింది. ఇప్పటివరకు జగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఓసి, బీసీలకు మాత్రమే కేటాయించారు. దీంతో జగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ప్రభుత్వం ఎస్సీ మహిళకు రిజర్వేషన్ కేటాయించింది. దీంతో జగ్గయ్యపేట నియోజకవర్గంలోని ఎస్సీలలో ఆశావాహుల లిస్ట్ భారీగా పెరిగింది. స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య, ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు నెట్టెం రఘురాం, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు తొండపు దశరథ జనార్ధన్‌లు ఈ నియోజకవర్గం వారు కావడంతో కొన్ని వివాదాలు, భేదాభిప్రాయాలు ఉండటంతో ఈ పదవి నియామకంలో కొంత జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తుంది.

ఇటీవల కాలంలో మారిన సమీకరణలు దృష్ట్యా జగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి ఓసి మహిళలకు కేటాయించినట్లు వినికిడి. ఎస్సీ మహిళకు ఏఎంసీ పదవి కేటాయిస్తే టిడిపి నమ్ముకుని పార్టీకి విశేషంగా సేవ చేసిన ఎస్సీ నాయకులు రావిరాల గ్రామానికి చెందిన ఇనుపనూర్తి రాజు, చిల్లకల్లు గ్రామానికి చెందిన కారుపాటి డేవిడ్, బూదవాడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పొట్టపొంగు బాబురావు, జగ్గయ్యపేట పట్టణం విలియంపేటకు చెందిన మల్లెల సాయి, మాడుగుల సురేష్ తదితరులు తమ సతీమణులు జగ్గయ్యపేట మార్కెట్ యార్డ్ (ఎఎంసి) పదవికి ముందు వరుసలో ఉన్నారు. వీరే కాక ఆశావాహులు మరి కొంతమంది ఉన్నారు. దీంతో మార్కెట్ యార్డు చైర్మన్ ఎంపిక నాయకులకు కొరకు రాని కొయ్యలా తయారైంది. ఓసి మహిళకు కేటాయిస్తే ముందువరుసలో మాజీ ఎంపీపీ మన్నే కళావతి రేస్‌లో ఉన్నట్లు తెలుస్తుంది. మాజీ జెడ్పిటిసి గింజుపల్లి శ్రీదేవి, మాజీ ఎంపీపీ వెల్ది శ్రీదేవి, చావా అనసూయ రేసులో ఉన్నట్లు సమాచారం.

మొదటగా రాష్ట్ర మహిళా నాయకురాలు ఆచంట సునీత పేరు సూచిస్తే రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ చైర్మన్ పదవి ఆశిస్తున్నట్లు టిడిపి వర్గాల నుండి సమాచారం. జగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎంపిక రాష్ట్ర పరిధిలో పరిగణనలోకి తీసుకుంటే ఓసి మహిళ, జిల్లా పరిధిలో తీసుకుంటే ఎస్సీ మహిళగా రిజర్వేషన్ కేటాయింపు ఉంటుందని టీడీపీ ఓసి, ఎస్సి నాయకులు చర్చించుకుంటున్నారు.

ఎజిపిగా నీరజ నియామకం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం ఏజీపీగా సీనియర్ న్యాయవాది ఎస్.టి. జి నీరజను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. గతంలో 2012 నుండి 2017 వరకు ఐదేళ్లు తాను ఏజీపీగా పనిచేసినట్లు చెప్పారు. అప్పటి ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సమర్థవంతంగా విధులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో మరోసారి ఏజీపీగా పని చేసే అవకాశం లభించిందన్నారు. ఈ విషయంలో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సహకారం ఉందన్నారు. ప్రభుత్వపరంగా గట్టిగా వర్క్ చేస్తానన్నారు. తన తండ్రి ఎస్. టి. జి. భాష్యకార్లు న్యాయవాద వత్తికి వన్నె తెచ్చేలా పని చేశారని, అదే స్ఫూర్తితో తానూ పని చేస్తున్నట్లు చెప్పారు. తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు కతజ్ఞతలు తెలిపారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-కోడూరు : ఈస్టర్ పండుగ సందర్భాన్ని పురస్కరించుకొని కోడూరు టిఎస్ఆర్ గ్రూప్ అధినేత తిరుపతి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెండు వేల మందికి మజ్జిగ పంపిణీ చేశారు. ఆదివారం కోడూరు ప్రధాన సెంటర్లోని టి ఎస్ ఆర్ మార్ట్ వద్ద ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమాన్ని కోడూరు మండల కూటమినేతలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, బండే శ్రీనివాసరావు, మర్రే గంగయ్యతో పాటు పార్టీ నేతలు, టిఎస్ఆర్ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

కొండాలమ్మ దేవస్థానంలో యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి ఆదివారం సందర్భంగా సుమారు 20 వల పైగా యాత్రికులు దర్శించుకున్నారు. అత్యధిక స్థాయిలో భక్తులు అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి మొక్కుబడులు తీర్చుకున్నారు. దేవస్థానానకు విచ్చేసిన భక్తులకు మజ్జిగ, తాగు నీరు, శానిటేషన్ ఏర్పాట్లు మరియు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా దర్శనం చేసుకొనుటకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు కలగకుండా గుడ్లవల్లేరు ఎస్సై ఎన్ వివి సత్యనారాయణ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం : ఎస్పి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణా జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలకు, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు ఆస్కారం లేకుండా జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు, ఆధ్వర్యంలో హెూటల్స్, లాడ్జిలను ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహిం చారు. మచిలీపట్నం పరిధిలో ఉన్న శ్రీనివాస లాడ్జ, ఆర్ ఆర్ భవన్, ఎస్ జి గ్రాండ్ మరి మరికొన్ని లాడ్జిలను, హెూటల్స్ లను పరిశీలించి, నిర్వాహకులతో మాట్లాడి ఇక్కడ ఎంతమంది ఉంటున్నది వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. నేర ప్రవత్తి కలిగిన వ్యక్తులు ఎవరైనా తారసపడితే వారికి సంబంధించిన సమాచారం పోలీసు వారికి తక్షణమే అందించాలని, లాడ్జిలలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. బస చేయడానికి రూమ్ కావాలని వస్తే వారి సమాచారం సేకరించి నియమ నిబంధనలు మేరకే అద్దెకివ్వాలి గాని సరైన ఐడి ప్రూఫ్ లు లేకుండా ఏ ఒక్కరికి గదులను అద్దెకి ఇవ్వవద్దని హెూటల్ యజమానులను సూచించారు. లాడ్జ్ లో ఉన్న ప్రతి గదిని క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్కడ బసు చేస్తున్న వ్యక్తులను వారు ఎక్కడ నుండి వచ్చినది, ఏ పని మీద వచ్చినది, ఎన్ని రోజుల నుండి ఇక్కడ ఉంటుంది ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. లాడ్జి నిర్వాహకులు లాడ్జి పరిసర ప్రాంతాలు స్పష్టంగా కనిపించేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, రూములను అద్దెకు తీసుకొని బస చేసే వారి వివరాలు తప్పనిసరిగా రికార్డులలో భద్రపరచాలని స్పష్టంగా తెలియజేశారు. హెూటల్స్ మరియు లాడ్జిలలో ఆసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, ఇకపై ఇలాంటి ఆకస్మిక తనిఖీలు మరింత పకడ్బందీగా చేపడతామన్నారు.

లాడ్జిలలో తనిఖీలు చేస్తున్న ఎస్పి గంగాధరరావు

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి - గుడివాడ : అగ్నిమాపక వారోత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం స్థానిక అగ్నిమాపక కేంద్రంలో అగ్నిప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఎటువంటి చర్యలు తీసుకోవాలి, వివిద ప్రదేశాలలో అగ్నిప్రమాదాలు ఏ విధంగా సంభవించుటకు అవకాశము కలదో తెలియజేసి అకస్మాత్తుగా ఎలక్ట్రికల్ ఫైర్స్ జరిగినపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలిపారు. ఈ అవగాహన సదస్సులో గుడివాడ టూ టౌన్ పోలీసు స్టేషన్ సి.ఐ. నాగ ప్రసాద్, ఎస్సైలతో పాటు గుడివాడ రూరల్ సి.ఐ ఎస్.ఎల్.ఆర్ సోమేశ్వరరావు, నందివాడ, గుడ్లవల్లేరు, పెదపారుపూడి ఎస్సైలు కె.శ్రీనివాసు, ఎన్.వి.వి సత్యనారాయణ, పి.వి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలు తదితరులు పాల్గొన్నారు. అగ్నిమాపక వారోత్సవాలు ముగింపు సందర్భంగా స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ఈవిఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఈడ్పుగంటి శ్రీనివాసరావు సౌజన్యంతో ఈవిఆర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో గుడివాడ అగ్నిప్రమాద శాఖ సిబ్బందికి మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ మెగా క్యాంపులో పాల్గొన్న ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ ఈ. రాజ్యలక్ష్మి, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ రాజేంద్ర, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాద నివారణ పరికరాల పనితీరును వివరిస్తున్న సిబ్బంది

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-కంకిపాడు : మండల పరిధిలోని మంతెన స్కూల్‌లో 1977-78 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా ఆదివారం కలిసి గత జ్ఞాపకాలు నెమరవేసుకున్నారు. అందరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. స్కూల్‌లో చదివిన జ్ఞాపకాలు గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. పూర్వ ఉపాధ్యాయులు మండవ కోటేశ్వరరావు, తెలుగు భోదించిన పెద్ది అమర లింగేశ్వర రావు దంపతులను ఘనంగా సన్మానించారు. అలాగే ప్రస్తుత భోదకులు స్కూల్ ఇంచార్జి రమణ రావు, విశ్వేశ్వర రావు గార్లను సన్మానించారు. టి రామకష్ణ అధ్యక్షతన, అన్నే గోపాల్ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో శేషు, ఏసుపాదం, పాపారావు, వసుధ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన 'విడాకులు కావాలి' నాటిక

ప్రజాశక్తి - గుడివాడ : కృష్ణా ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ గుడివాడ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి నాటికల పోటీలు రెండవ రోజు మొదటి ప్రదర్శనగా వల్లూరి శివ ప్రసాద్ రచన, ప్రముఖ నాటక దర్శకుడు గంగోత్రి సాయి దర్శకత్వంలో "విడాకులు కావాలి" నాటిక ప్రదర్శించారు. "ఇచ్చి పుచ్చుకునే సంస్కారం.. దంపతుల సంసారాన్ని ఆనందమయం చేస్తుందనే" చక్కని సందేశంతో, దాంపత్య జీవితంలో తలెత్తే చిన్న చిన్న సమస్యల్ని పంతాలకు పట్టుదలలకు పోకుండా సంయమనం తో వ్యవహరించినట్లయితే ఆదర్శ దంపతుల్లా గడపచ్చు అంటూ "విడాకులు కావాలి" అనే నాటిక ప్రేక్షకుల్ని ఆలోచింపచేసేలా సాగింది. నటీనటులు తన సహజ నటనతో ప్రేక్షకుల కరతాళ ధ్వనులు అందుకున్నారు. రెండవ ప్రదర్శన గా ప్రైవేటు ఆసుపత్రులు లాభాపేక్ష మాని, సామాజిక బాధ్యత గా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవ చేయాలనేలా ఒక కార్పొరేట్ వైద్యుని నిర్ణయం ప్రజల ఆశలను చిగురింప చేస్తుంది అనే సామాజిక బాధ్యతా సందేశంతో ప్రదర్శించిన "చిగురు మేఘం" నాటిక అందరినీ ఆలోచింపచేసింది. ఈ నాటికను కావూరి సత్యనారాయణ రచించగా, యేపూరి హరిబాబు దర్శకత్వం వహించారు. చివరి ప్రదర్శనగా వైవాహిక జీవితంలో నూతన దంపతులు చిన్న చిన్న మనస్పర్థలతో "నాన్నా నేనొచ్చేస్తున్నా" అంటూ పుట్టింటికి వచ్చేస్తూ కాపురాలు చెడగొట్టుకుంటున్నారని, అలా కాకుండా నాన్నా, మా ఇంటికి ఎప్పుడు వస్తారు అనే ఆహ్వానం పలికే రోజులు రావాలంటూ చక్కని సందేశంతో ప్రదర్శించిన "నాన్నా నేనొచ్చేస్తున్నా" నాటిక కూడా ప్రేక్షకుల్ని అలరించింది. పురస్కారాల ప్రదానోత్సవంలో భాగంగా డా॥ వల్లూరిపల్లి సుబ్రహ్మణ్యేశ్వర రావు వైద్య సేవా పురస్కారాన్ని గుడివాడ పట్టణ వైద్యులు డా॥ పొట్లూరి వంశీకి, "బోయిన రాజేష్ యువ పురస్కారాన్ని" వర్ధమాన నటుడు బనిగళ్ళపాటి నాగసాయికి అందించారు. ఈ కార్యక్రమాలలో సంస్థ అధ్యక్షులు పి.వి.సత్యనారాయణ, వైద్యులు పొట్లూరి వంశీ, ఆడిటర్ శ్రీకర్ బాబు, సంస్థ సభ్యులు మట్టా రాజా, ఆర్.వి.ఎల్.నరసింహారావు, ఏ.ఎస్.వి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాటికలో ఒక దృశ్యం

అగ్నిప్రమాదంలో వరిగడ్డి దగ్ధం

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం గోగినేనిపాలెం గ్రామంలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో నాలుగు ఎకరాల వరిగడ్డి దగ్ధమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు గోగినేని పాలెం గ్రామానికి చెందిన కుంపటి వెంకటేశ్వరరావు నాలుగు ఎకరాల వరిగడ్డి వాముకు మధ్యాహ్నం ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నం చేస్తూ మొవ్వ ఫైర్ స్టేషన్కు సమాచారం అందించారు. మొవ్వ ఫైర్ ఆఫీసర్ కె.వెంకటేశ్వరరావు, సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో 60 వేలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. **ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ :** మచిలీపట్నం మండలం కెపిటి పాలెం పంచాయతీ పరిధిలోని కమ్మవారిచెరువు గ్రామంలో కోట రమణ కు చెందిన సుమారుగా 10 ఎకరాల వరిగడ్డి వామి అగ్నికి ఆహుతైంది. ఆదివారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో నిప్ప అంటుకొని పూర్తిగా తగలబడిపోవడంతో సుమారు 60 వేల రూపాయల నష్టం వాటిల్లినట్టు అవనిగడ్డ ఫైర్ సిబ్బంది తెలిపారు.

మడకా ప్రసాద్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - గుడివాడ : ఖో-ఖోలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎందరో క్రీడాకారులను తయారుచేసిన ఘనత అంతర్జాతీయ ఖో-ఖో రిఫరీ మడకా ప్రసాద్‌కు దక్కుతుందని ఎన్‌టిఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు కొనియాడారు. ఆదివారం స్థానిక ఎస్.పి.ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఖో-ఖో కోచ్ మడక ప్రసాద్ పదవీ విరమణ అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా యలవర్తి మాట్లాడుతూ వ్యాయామోపాధ్యాయునిగా మడకా ఎందరో ఖోఖో క్రీడాకారులను ప్రోత్సహించారని, ఎన్‌సిసి అధికారిగా విశిష్ట సేవలందించారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు చేరేలా చేసిన కృషి మరువలేనిదన్నారు. విద్యతో పాటు క్రీడలకు సమ ప్రాధాన్యతనిచ్చారన్నారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, పముఖ వైద్యులు డా.పొట్లూరి వంశీమోహన్, జనసేన పార్టీ నాయకులు సాయన్ రాజేష్, పాల్గొన్నారు.

హెరిటేజ్ వాక్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాలలో సోమవారం జరిగే ఘంటసాల హెరిటేజ్ వాక్ కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ప్రవాస భారతీయులు గొర్రెపాటి రంగనాథ బాబు తెలిపారు. ఘంటసాల గ్రామంలోని మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహానికి జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకష్ణ, గొర్రెపాటి విద్యా ట్రస్ట్ ప్రతినిధి కొండపల్లి రామకష్ణ, ఘంటసాల యు.వి.ఆర్ . గొర్రెపాటి స్కూల్ ప్రిన్సిపల్ లోయ నాగేశ్వరరావు, ఉపాధ్యాయునులతో కలిసి ఎన్నారై రంగనాథ బాబు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ వైస్ చైర్మన్ రామకష్ణ మాట్లాడుతూ 1967 ఏప్రియల్ 21న మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు ఘంటసాల గ్రామం విచ్చేసి మూడు గంటల పాటు కచేరి నిర్వహించారని ఆ రోజును పురస్కరించుకొని సోమవారం గ్రామంలో విద్యార్థులు, గ్రామ ప్రముఖులు ఉదయం 8 గంటలకు ఘంటసాల హెరిటేజ్ వాక్ నిర్వహిస్తారని తెలిపారు.

డిఎస్‌సి షెడ్యూల్ విడుదలపై హర్షం

ప్రజాశక్తి-అవనిగడ్డ : ప్రభుత్వం మెగా డీఎస్సీ ఆదివారం ప్రకటించడంతో అవనిగడ్డలోని డీఎస్సీ శిక్షణ పొందుతున్న విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. విద్యా నికేతన్ డీఎస్సీ శిక్షణా కేంద్రంలో అభ్యర్థులు సీఎం చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. విద్యనికేతన్ విద్యాసంస్థ డైరెక్టర్ పంద్రాజు లంకమ్మ ప్రసాద్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - వన్‌టౌన్ : 2026–25 విద్యా సంవత్సరానికి నూతన కార్యవర్గ సెంట్రల్ కమిటి ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఈ కార్యక్రమం కేదారేశ్వర పేట, పండ్లమార్కెట్‌లో గల వి సి ఎస్, టిఎ హాల్‌లో నిర్వహించారు. నూతన అధ్యక్షులుగా శ్రీహరి (సిద్దార్థ ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఆర్ఆర్ పేట), సెక్రటరీగా గణేష్ బాబు (నాగార్జున స్కూల్, గుణదల), ట్రెజరర్‌గా పుప్పాల శ్రీనివాసరావు (శ్రీవిద్యాంజలి హైస్కూల్) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల ప్రధాన అధికారి, అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు దేవినేని కిషోర్ కుమార్ ప్రకటించారు. నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నికల సహాయ అధికారి వి.అమ్మాజీ ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గ సభ్యులకు వివిధ విద్యాసంస్థల అధినేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనికుమారి, టి.శ్రీనివాసరావు, ఏ.సాయికృష్ణ, బాబు, గోనా సాంబశివరావు, మురళీమోహన్, పి.కె.సాంబశివరావు, ఎన్‌వివిఎస్.ప్రసాదరావు పాల్గొన్నారు.

బాధితురాలికి పరామర్శ

ప్రజాశక్తి - వత్సవాయి :

పెనుగంచిప్రోలు గ్రామం అంబేద్కర్ ఎస్‌సి కాలనీకి చెందిన ఫణితి వెంకట్రావమ్మ గత కొంతకాలంగా అనారోగ్య కారణంతో బాధపడుతున్నారనే విషయం తెలుసుకొని ఆదివారం వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించిన వైసిపి జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, మాజీ పట్టణ పార్టీ అధ్యక్షుడు కాకాని హరి, నియోజకవర్గ కార్మిక విభాగ అధ్యక్షుడు మెండెం రామారావు, నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షుడు దేరంగుల శ్రీనివాసరావు, పెనుగంచిప్రోలు మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ నల్లబోతుల వెంకటేష్, చేని రాంబాబు, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ తమ్మిశెట్టి సోమయ్య తదితరులు పరామర్శించారు.

ఆశ్రమంలో చలివేంద్రం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం అంబరుపేట గ్రామంలో సద్గురు బోదానంద స్వామి ఆశ్రమంలో ఆదివారం చలివేంద్రాన్ని నందిగామ ఎస్ఐ అభిమన్యు ప్రారంభించారు. ఆశ్రమ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

టెర్రస్ గార్డెనింగ్‌పై యువత ఆసక్తి చూపాలి

ప్రజాశక్తి - భవానీ పురం :

పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అందించేందుకు ప్రత్యేకమైన సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ ప్రకృతి ప్రేమికులను ప్రోత్సహించడమే లక్ష్యంగా సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ బృందం వారు (సిటిజి) భవానీపురం వాసవి కళ్యాణ మండపంలో ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎపి ఫెడరేషన్ ఆఫ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రెసిడెంట్ వక్కలగడ్డ భాస్కరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సుజనా చౌదరి మాట్లాడుతూ ప్రతి కుటుంబం తమ సొంత కూరగాయలను ఎటువంటి రసాయనాలు, రసాయన ఎరువులు, పురుగు మందులు కలపకుండా సహజంగా పండించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనాన్ని పొందవచ్చన్నారు.

పలుచోట్ల ఈస్టర్ వేడుకలు

ప్రజాశక్తి - వత్సవాయి : మండలంలో కన్నెవేడు, మక్కపేట, భీమవరం, మంగళ్ళు, దేశ పాలెం, పెద మోదుగు పల్లి, వత్సవాయి, పాలంపల్లి, డబ్బాకు వల్లి, ఖమ్మంపాడు, పెనుగంచిప్రోలు మండలంలో బుచ్చింతాల, అనిగండ్లపాడు, గుమ్మడిదూరు పల్లె గిరి, ముండ్లపాడు తదితర గ్రామాల్లో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు సిఎస్ఐ ఆర్‌సిఎం, హెబ్రోన్, ఐపిసిసి, ఐపిసి, పెంతుకోస్తు, చర్చిలో ప్రార్థనలు చేశారు. చర్చిలో ప్రార్థనలు చేపట్టి ఈస్టర్ వేడుకలపై పాస్టర్లు వాక్యోపదేశం చేపట్టారు. పాటలు పాడారు. అనంతరం అన్నదానం చేశారు. **రెడ్డిగూడెం :** రెడ్డిగూడెం మండలంలో క్రీస్తు పునరుత్థానపు వేడుకలు క్రైస్తవులు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఏసుక్రీస్తు మృతి చెంది మూడో దినమున సమాదిలో నుండి తిరిగి లేచిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ క్రైస్తవులు జరుపుకునే ఈ వేడుకలు మండలంలో ఉన్న అన్ని చర్చీలలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బైబిల్ పరీక్షలో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు.

భవానీ పురం : భవానీపురం ఫిలదెల్ఫియా ఎజి చర్చిలో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకలకు ఎమ్మెల్యే సుజనా చౌదరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాస్టర్ జాకబ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి క్రైస్తవులందరికీ ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుజనా మాట్లాడుతూ సర్వ మానవాళికి ఏసుక్రీస్తు లోక రక్షకుడని కొనియాడారు. కూటమి ప్రభుత్వం సర్వ మతాలకు సమాన ప్రాధాన్యత, గౌరవం ఇస్తుందన్నారు. ఈ వేడుకల్లో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్ కూటమినేతలు పాల్గొన్నారు. హెచ్‌బి కాలనీలోని షారోను చర్చిలో ఈస్టర్ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం షారోను సంఘంలోని ఏడుగురు సభ్యులు బాప్తిస్మం తీసుకున్నట్లు చర్చి పాస్టర్ మొవ్వ పరిశుద్ధ బాబు తెలిపారు. ఈ సందర్భంగా అమెరికాలో ఉంటున్న షారోను చర్చి మెంబర్ బబ్లూ సండేస్కూల్ పిల్లలకు, సంఘంలోని యూత్ సభ్యులకు బైబిళ్లు పంపగా వాటిని పాస్టర్ బాబు అందజేశారు. అనంతరం భోజన కార్యక్రమాలు నిర్వహించారు. **విస్సన్నపేట :** మండలంలో పలుచోట్ల క్రైస్తవ సోదరులు భక్తిశ్రద్ధలతో ఈస్టర్ పండగ పర్వదినాన్ని పురస్కరించుకొని వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు ఆరాధనలు నిర్వహించారు. **విజయవాడ :** విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వ్యాప్తంగా ఈస్టర్ వేడుకలను ఆదివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాజీవ్ నగర్ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో వైసీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొన్నారు. క్రీస్తు పునరుజ్జీవనానికి గుర్తుగా క్రైస్తవులు ఈస్టర్ పండుగను జరుపుకుంటారని ఈ సందర్భంగా మల్లాది విష్ణు అన్నారు. సాటి మనిషి కోసం ఏసుక్రీస్తు అనుసరించిన త్యాగ నిరతిని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మానవత్వంతో కూడిన శాంతియుత జీవనం క్రీస్తు ఎంచుకున్న మార్గం అని తెలిపారు. యేసు స్ఫూర్తిదాయక బోధనలు ప్రజల మధ్య శాంతి సౌభ్రాతత్వాలు వెల్లివిరిసేలా చేస్తాయన్నారు. ప్రభువు దీవెనలు నియోజకవర్గ ప్రజలపైన, వైఎస్ జగన్మోహన్ రెడ్డిపైన మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాస్టర్ సుధాకర్, నాయకులు పసుపులేటి యేసు, నాగిరెడ్డి, రమణారెడ్డి, రాజు, జగదీష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు. **విజయవాడ అర్బన్ :** క్రీస్తు మార్గమే మానవాళికి రక్షణ మార్గమని బేతేలు మినిస్ట్రీస్ బైబిల్ కళాశాల ప్రెసిడెంట్ అండ్ డైరెక్టర్ రెవెరెంట్ ఫాస్టర్ డాక్టర్ స ల్లూరి జయకుమార్ బాబు అన్నారు. ఈస్టర్ పర్వదినం పురస్కరించుకొని ఆదివారం న్యూ అయోధ్యా నగర్ లోని బేతేలు మినిస్ట్రీస్ ప్రార్థనా మందిరంలో ఆదివారం ఉదయం ఈస్టర్ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జయకుమార్ బాబు మాట్లాడుతూ సత్యం జయించిన రోజున భక్తులు ఈస్టర్ పండుగను ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారని అన్నారు. క్రీస్తు అనుసరించిన కరుణ, ప్రేమను ప్రతి ఒక్కరూ అలవరచుకుని ముందుకు సాగాలని అన్నారు. క్రీస్తు పాపుల రక్షణార్థమై సిలువపై తన రక్తాన్ని చిందించి ప్రాణ త్యాగం చేశారని అన్నారు.

హెచ్‌బి కాలనీలోని షారోను సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు

మినిస్ట్రీస్ బైబిల్ కళాశాలలో

వన్‌టౌన్ చర్చిలో పాల్గొన్న విష్ణు

రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ :

రాష్ట్ర సిఎం నారా చంద్రబాబు జన్మదిన వేడుకలు గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం (ఎన్టీఆర్ కార్యాలయం)లో ఆదివారం ఘనంగా జరిగాయి. ముందుగా ఎంపి కేశినేని శివనాథ్ ఎన్టీఆర్ భవన్ ఆవరణలో ఏర్పాటు చేసిన చంద్రబాబు ఫోటో గ్యాలరీను ప్రారంభించారు. ఆర్టిస్టు బాలు గీసిన చిత్రాలను ఆసక్తిగా తిలకించారు. అనంతరం సీఎం చంద్రబాబు జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్ ను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఎపి బిల్డింగ్ అదర్ కనస్ట్రక్షన్ కార్పొరేషన్ గొట్టుముక్కల రఘురామరాజు, టిడిపి అధికార ప్రతినిధి నాగుల్ మీరాలతో కలిసి కట్ చేసి ప్రజలందరీ తరుపున సిఎం చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సిఎం చంద్రబాబు చిత్రాలను అద్భుతంగా చిత్రీకరించిన ఆర్టిస్ట్ బాలుతో పాటు ఆయన కుమార్తె సాయిశ్రీని ఎంపి కేశినేని శివనాథ్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడారు.

ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తొలుత మొగల్రాజపురంలోని ఎమ్మెల్యే బొండా ఉమా ఇంటి వద్ద 'గాజుల బ్రదర్స్ ఆధ్వర్యంలో ప్రారంభమైన వేడుకల్లో ముందుగా చలివేంద్రాన్ని ప్రారంభించి కేక్ కట్ చేసి ఫ్రూట్స్ పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 27, 36, 58, 60, 61, 62, 63, 64 డివిజన్ల పరిధిలో జరిగిన సిఎం చంద్రబాబు జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. కేక్ కట్ చేసి, మజ్జిగ, పండ్లు పంపిణీ చేశారు. **తిరువూరు :** ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కార్యాలయంలో వేడుకలు నిర్వహించగా రాష్ట్ర ఆర్గానిక్ ప్రోడక్ట్ సర్టిఫికెట్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్ ఆధ్వర్యంలో రక్తదానం దాన శిబిరం ఏర్పాటు చేయగా తెలుగు తమ్ముళ్లు రక్తదానం చేశారు. **మైలవరం :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు జన్మదిన వేడుకలను ఆదివారం మైలవరంలో ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు పండ్లు, పాలు అందజేశారు. **ఇబ్రహీంపట్నం :** కొండపల్లి మున్సిపాలిటీ, ఇబ్రహీంపట్నం మండలంలో టిడిపి నాయకులు నిర్వహించారు. కొండపల్లి, ఇబ్రహీంపట్నంలో పేదలకు అల్పాహారం అందజేశారు. కేకులు కట్ చేసి ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య మాట్లాడారు. **విస్సన్నపేట :** సిఎం చంద్రబాబు జన్మదిన వేడుకల సంరద్భంగా ఎన్ఆర్ఐ వల్లభనేని గిరి బాబు ఆర్థిక సౌజన్యంతో చిరు వ్యాపారులకు తోపుడుబండ్లను పంపిణీ చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మహిళలకు చీరలు, ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. **నందిగామ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలు నందిగామలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. నందిగామ గాంధీ సెంటర్ లో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ముఖ్య అతిథిగా పాల్గొని చంద్రబాబు జన్మదిన కేక్ కట్ చేశారు. అనంతరం ప్రజలకు అన్నదానం చేశారు. నందిగామ సబ్ జైలు, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి, నందిగామ ఆస్పత్రి అభివద్ధి కమిటీ అధ్యక్షుడు ఏపూరి నాగేశ్వరరావు, నందిగామ జిల్లా పరిషత్ హై స్కూల్‌లో మణిపాల్ హాస్పిటల్స్ విజయవాడ వారి సహకారంతో ఫార్మర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మండలం లచ్చపాలెం వృద్ధుల ఆశ్రమంలో నందిగామ మండల తెలుగుదేశం పార్టీ నాయకులు వద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

విజయవాడ : 1977–78లో మంతెన స్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం నిర్వహించారు. టి.రామకృష్ణ అధ్యక్షతన, అన్నే గోపాల్ నిర్వహణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థులు ఆత్మీయ పలకరింపులతో గత జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. స్కూల్‌కు ఆ రోజుల్లో ఫండ్ ఎలా వసూలు చేసింది, ఎలా చదువు చెప్పింది గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాడు లెక్కలు చెప్పిన మండవ కోటేశ్వరరావు, తెలుగు బోధించిన పెద్ది అమర లింగేశ్వరరావు దంపతులకు ఘనంగా సన్మానం చేశారు. వీరితోపాటు ప్రస్తుత బోధకులు స్కూల్ ఇన్చార్జి రమణరావు, విశ్వేశ్వరరావును సన్మానించారు. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం స్కూల్, పక్క గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమం చేపట్టాలని తీర్మానించారు. ఈ కార్యక్రమానికి శేషు, ఏసుపాదం, పాపారావు, వసుధ నాయకత్వం వహించి అందరినీ ఒక చోటకు చేర్చినందుకు అందరు అభినందనలు తెలిపారు.

పేదోడి ఫ్రిజ్‌కి గిరాకీ

ప్రజాశక్తి- గన్నవరం : ఏప్రిల్ నెలలోనే ఎండల తీవ్రత పెరగడంతో చల్లటి నీరు ఇచ్చే మట్టి కుండలకు గిరాకీ పెరుగుతోంది. సామాన్యుల నుండి మధ్యతరగతి వ రకు కుండలు కొనుగోలు చేసే పనిలో ఉన్నారు. ఎర్రటి మట్టి కుండలోని చల్లటి నీటిని తాగి ఆరోగ్యానికి మంచిదని వైద్యులు చెబుతున్నారు. ఫ్రిజ్లో నీరు తాగడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు రావడానికి అవకాశం ఉంటుంది. మట్టికుండలో నీటితో ఎలాంటి సమస్యలు రావనేది అక్షర సత్యం. అందువల్ల మార్కెట్ లో మట్టి కుండలకు డిమాండ్ వస్తుంది. దీనికి మరోపేరు పేదోడి ఫ్రిజ్. వేసవి వచ్చిందటే సామాన్యులు కుండలను ఆశ్రయిస్తారు. దీంతో వాటికి డిమాండ్ ఏర్పడుతోంది. కుండలు నా లుగు సైజుల్లో మార్కెట్లో లభిస్తాయి. ఐదు లీటర్లనీరు పట్టే దాని ధర 100 రూపాయలు. పది లీటర్లు పట్టేది ధర 200 రూపాయలు. 12లీటర్ల నీరు పట్టేది ధర 220 రూపాయలు. 15 లీటర్ల నీరు పట్టేది ధరరూ. 250. ఇంకా పెద్దవి కావాలంటే రూ.300 నుంచి రూ.350 వరకూ ధర చెల్లించాల్సి ఉంటుంది. గన్నవరంలో నాలుగు చోట్ల మట్టి కుండలు లభిస్తాయి. సీజన్ తో సంబంధం లేకుండా వ్యాపారాలు చేస్తు న్నారు. కుండలు నిల్వ చేయడం కష్టమని, ఎదైన ఒకటి పగిలితే ఆర్థికంగా నష్టపోవాల్సివస్తుందని వ్యాపారులు తెలిపారు అందుకే సీజన్ లో విక్రయించే వాటి ధరలను కాస్త పెంచి విక్రయిస్తుంటామని చెబుతున్నారు.

ఏదేమైనా కుండల ధరలకు క్రమంగా రెక్కలు వస్తున్నాయని సామాన్యులు అంటున్నారు. సమాజంలో ప్లాస్టిక్ వాడకం పెరగటంతో అనాధిగా ఉన్న కుమ్మరి వత్తి కార్మికులకు ఆదరణ లేకుండా పోతుంది. వారంతా వేరే వత్తులోకి వెళ్తున్నారు. వేసవిలో కుండలను తయారు చేస్తుంటారు. ఒకప్పుడు గొల్లనపల్లి, గోపవరపుగూడెం, సూరంపల్లి, గన్నవరం, కేసరపల్లి గ్రామాల్లో వత్తిదారులు ఉండేవారు. ప్రస్తుతం ఒకటి రెండు గ్రామాల్లో మాత్రమే ఉన్నారు. కుండల తయారీకి వినియోగించే ముడి మెటీరియల్ ధరలు పెరగడంతో గిట్టుబాటు కావడం లేదని అంటున్నారు. కుల వత్తిని వదులుకోలేక సీజన్లో చేస్తున్నామని చెప్పారు. కుండ త యారుచేసి మార్కెట్లోకి తీసుకెళ్లడానికి రూ.70 పెట్టుబడి అవుతోందని, ఐదు రూపాయలు మార్జిన్‌తో రూ.75 ఇస్తామని తయారీదార్లు తెలిపారు. దానిని వ్యాపారులు తమకిష్టమైన రేట్లకు అమ్ముతారు. పగిలిపోయే వాటి నష్టాలను జనాలపైనే వేస్తుంటారు.

మట్టి కుండలోని నీరు ఆరోగ్యం

ఎలక్ట్రికల్ ఫ్రిజ్ ఆరోగ్యానికి హాని కరమని వైద్యులు చెబుతారు. దాంట్లోని నీరు తాగితే ఆరో గ్య సమస్యలు వస్తాయని అంటారు. అయితే మారుతున్న సమాజం లో ఫ్రిజ్లోని నీరు తాగ దానికి ఆసక్తి చూపుతారు. చల్లటి నీరు తాగాలంటే ఫ్రిజ్ కావాలనే పరిస్థితి వచ్చింది. మార్కె ట్లో వాటి రేట్లు వేలల్లో ఉండటంతో సామా న్యులు వాటి జోలికి వెళ్లడం లేదు. కుండలో నీ రు తాగితే శ్రేష్టమని పెద్దలు చెబుతారు. కుండలో నీరు తాగితేరోగాలు రావని అంటారు. నీరు తాగితే శ్రేష్టమని పెద్దలు చెబుతారు. కుండలో నీరు తాగితేరోగాలు రావని అంటారు. అది నిజమనితెలిసినా ఎవ్వరూ దాని గురించి ఎవ్వరూ పట్టించుకోవటం లేదు. ఆర్థికంగా ఉన్న వారంతా కరెంటు ఫ్రిజ్లోనే వాడుతున్నారు. దీనితో కుండల తయారీదార్లకు మనుగడ లేకుండా పోతుంది. గన్నవరం పట్టణంలో నాలుగు కుటుంబాలు మట్టిపాత్రలు, కుండలు అమ్ముతున్నారు. వేసవిలో వ్యాపారం బాగుంటుందని, మిగతారోజుల్లో పెద్దగా ఉండడంటుని చెప్పారు.



టెన్నిస్ క్రీడాకారుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : మచిలీపట్నం పాత రామన్నపేటకు చెందిన బొడ్డు మురళి నాగ వేంకట కార్తీక్ జిఎఫ్ఐ నేషనల్ టెన్నిస్ టోర్నీలో విశేషంగా రాణించి బ్రాంజ్ మెడల్ సాధించారు. ఆటలో మరింత ప్రగతిని సాధించేందుకు అవసరమైన టెన్నిస్ కిట్ కొనుగోలుకు కొల్లు ఫౌండేషన్ తరపున ఆర్థిక సహాయం అందించారు. ఆదివారం కార్తీక్‌కు చెక్‌ను అందజేసిన ఫౌండేషన్ నిర్వాహకులు కొల్లు పునీత్ శుభాకాంక్షలు తెలియజేస్తూ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. మచిలీపట్నం నుండి నేషనల్ స్థాయిలో ఆడే ప్రతి ఒక్కరికీ కొల్లు ఫౌండేషన్ తరపున ప్రోత్సాహం, మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సేవలో న్యాయమూర్తి దంపతులు

ప్రజాశక్తి మోపిదేవి : మోపిదేవి గ్రామంలో కొలువుతీరిన శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని ఆదివారం రాష్ట్ర హైకోర్టు జడ్జి టి. మల్లిఖార్జున రావు దంపతులు దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికిన అర్చకులు, ఆలయ అధికారులు న్యాయమూర్తి దంపతులు నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించడంలో సహకరించారు. మల్లిఖార్జున రావు దంపతులు కు స్వామివారి చిత్ర పటాన్ని, తీర్థ ప్రసాదాలను ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు అందజేశారు.

హైకోర్టు జడ్జి టి. మల్లిఖార్జునరావు దంపతులకు తీర్థప్రసాదాలు అందిస్తున్న దృశ్యం

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక కోతి బొమ్మ సెంటర్లోని టి.ప్రభావతి గార్డెన్స్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో డా.తిపిర్నేని లక్ష్మీ పెరుమాళ్ళు, ప్రభావతి, చలసాని చౌదరి రాయన్‌ల జ్ఞాపకార్థం డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజి పెదఆవుటపల్లి వారి సహకారంతో ఆదివారం నిర్వహించిన మెడికల్ క్యాంపులో సుమారు 55 మంది బాధితులు వైద్య సేవలను పొందారు. వైద్య సేవలు పొందిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు టి.ఎన్.రాజశేఖర్, కార్యదర్శి జి.కిరణ్ బాబు, ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి జి.నరేష్ పూర్వ అధ్యక్షులు ఎ.సుబ్రహ్మణ్యేశ్వర రావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవ దేవాలయాల్లో ఈస్టర్ పండుగను ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి క్రీస్తు పునరుద్ధరణ లో భాగంగా మండల కేంద్రమైన గుడ్లవల్లేరు ఆర్సిఎం దేవాలయం వద్ద ఫాదర్స్ మ్యాచ్ యు నిరాకల్, ప్రతాప్, నరేష్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే బాప్టిస్ట్ దేవాలయం వద్ద, కౌతరం విశ్వాస సంఘం అలాగే అనేక దేవాలయాల్లో ప్రత్యేక ప్రాంతంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాదిమంది సంఘస్తులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** క్రీస్తు పునరుద్దాన దినం ఈస్టర్ పండుగ వేడుకలు మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించడం జరిగింది. మండలంలోని అన్ని ప్రధాన చర్చలలో క్రీస్తు బోధనను పాస్టర్లు వినిపించారు. ఏసుక్రీస్తు లోకనక్షణార్థం సిలువపై మరణించి ఆదివారం పునరుద్దానుడైన సంగతులు గూర్చిన ప్రత్యేక ప్రార్థనలు చర్చలలో నిర్వహించారు. తోట్లవల్లూరు దైవ స్వరూపి ప్రార్థన మందిరంలో పాస్టర్ సొలొమాన్ ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున వీధులలో క్రీస్తు బోధను ప్రచారం చేశారు. **ప్రజాశక్తి మొవ్వ :** మొవ్వ మండలంలోని పలు క్రీస్తు దేవాలయాలలో ఈస్టర్ పండగ వేడుకలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. క్రీస్తు దేవాలయాలలో కొవ్వొత్తుల దీపాలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మొవ్వలోని ఆర్. సి. ఎం. చర్చిలో పాస్టర్ పులిపాక జాకబ్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏసు క్రీస్తు విగ్రహానికి ధూప దీపాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. **ప్రజాశక్తి - గుడివాడ :** ఈస్టర్ పర్వదిన వేడుకలను గుడివాడ ఏలూరు రోడ్డులోని మౌంట్ కార్మెల్ మాత చర్చి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి నుండి ఆదివారం ఉదయం వరకు చర్చి ప్రాంగణంలో, చర్చ్ ఫాదర్స్ గుజ్జుల మైఖేల్, శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో క్రైస్తవ విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్.సి.యం చర్చ్ సిస్టర్‌లు, పెద్ద ఎత్తున క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

మొవ్వ మండలంలో...

గుడివాడ మండలంలో...

అల్లాపురం పంచాయతీలో రూ. 1.10 కోట్లతో అభివృద్ధి : సర్పంచ్

ప్రజాశక్తి-గన్నవరం : అల్లాపురం గ్రామపంచాయతీలు గత నాలుగు ఏళ్లలో రూ. 1.10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు సర్పంచ్ డొక్కు సాంబశివ వెంకన్న బాబు తెలిపారు. ఆదివారం ఆయన పంచాయతీ కార్యాలయంలో మాట్లాడారు. సుదీర్ఘకాలం పాటు సిపిఎం ఏలుబడిలో పంచాయతీ కొనసాగిందన్నారు. గత రెండు పర్యాయాలు వేరొకరి పాలనలోకి వచ్చిందన్నారు. అయితే పంచాయితీ అభివద్దే లక్ష్యంగా అందరూ పనిచేయడం జరుగుతుందని చెప్పారు. ప్రజలు తనకిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పేదల పేటలో రూ.25 లక్షలతో పక్కా డ్రైనేజీల నిర్మాణం, రూ. 6 లక్షల గ్రావెల్ రోడ్ల నిర్మాణం, రెండు లక్షలతో బోర్వెల్ ఏర్పాటు చేపట్టినట్లు చెప్పారు. రూ. 35 లక్షలతో సచివాలయ భవనం నిర్మాణం కూడా జరుగుతుందన్నారు. నిధుల కొరత వలన పనులు సగంలో ఆగాయని తెలిపారు. దాత గుర్రం నాని సహకారంతో శ్మశాన వాటికలు 10 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణం జరిగిందన్నారు. జగనన్న కాలనీలో 13 లక్షలతో రోడ్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. లక్ష రూపాయలతో ఎల్ఈడి లైట్లు పెట్టామన్నారు. పంచాయతీ, ప్రభుత్వ నిధులు, దాతల సహకారంతో పంచాయితీని అభివద్ధి పథంలో నడిపిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కలెక్టరేట్ సమావేశ హాలులో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక-మీకోసం కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించుకోవచ్చునన్నారు.

అల్లాపురం కార్యదర్శిపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం అల్లాపురం పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరరావు సస్పెన్షన్ ఎత్తివేయాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా కలెక్టర్ కోరింది. ఆదివారం ఏపీ ఎన్జీవోస్ గన్నవరం తాలుకా యూనిట్ నందు కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఉమా సస్పెన్షన్ తీరును తాలూక యూనిట్ కార్యవర్గం ఖండించింది. ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షులు సాంబశివరావు మాట్లాడుతూ అల్లాపురం పంచాయతీలు పన్నులు సక్రమంగా సేకరించడం లేదని, స్వచ్ఛ కార్యక్రమాన్ని సరిగా పరిశీలన చేయడం లేదంటూ కార్యదర్శి ఉమాను సస్పెండ్ చేయడం సరికాదన్నారు. నిజం చెప్పాలంటే గ్రామంలో 80శాతం వరకు ప్రభుత్వ కార్యకలాపాలు విజయవంతంగా చేస్తున్న పరిస్థితి ఉందన్నారు. రాజకీయ కోణంలో ఈ వ్యవహారం జరిగినట్లుగా అనిపిస్తుందని, ప్రజాప్రతినిధులు కూడా పునరాలోచన చేసుకోవాలని విన్నవించారు. ఉమాకు న్యాయం జరిగే వరకూ అసోసియేషన్ పని చేస్తుందన్నారు. ఈ విషయంలో అసోసియేషన్ కార్యవర్గం గౌరవ సభ్యులకు న్యాయం జరిగే వరకు పోరాడుతుందని వివరించారు.

మాట్లాడుతున్న సాంబశివరావు

అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి - విజయవాడ : జిల్లాలోని ఆయా పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు, లా అండ్ ఆర్డర్, క్రైమ్ సస్పెక్ట్‌లకు, చెడునడత కలిగిన వ్యక్తులకు వివిధ సమయాల్లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలని అన్నారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొనకూడదని సూచించారు. ఎటువంటి కేసుల్లో కల్పించుకోవద్దని తెలిపారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా చేయకుండా సత్ ప్రవర్తన మార్గంలో నడవాలని చెప్పారు. ప్రతి ఒక్కరు చెడు వ్యసనాలను దూరం చేసుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరిపై పోలీస్ వారి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఎవరైనా ఎక్కడైనా గొడవలు, ఇతర నేరాల్లో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని వేదాద్రి గ్రామానికి చెందిన రుద్రపొంగు వెంకటేశ్వర్లు, పసుమర్తి భాస్కర్‌రావు ఇటీవల కాలంలో ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆదివారం వైసిపి జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు, వారికి ఆర్థికంగా సహాయం చేసి, వారి కుటుంబనికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత విభాగ అధికార ప్రతినిధి పెంటి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా వైకుంఠరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు జవ్వాజి నాగరాజు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యూటోరియల్స్ అసోసియేషన్, కొండపల్లి డివిజన్ వార్షిక సమావేశం ఆదర్శ విద్యానికేతన్ ఆవరణలో అధ్యక్షులు దేవినేని జోనికుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కార్యదర్శి మహమ్మద్ హాబీబుల్లా వార్షిక నివేదిక సమర్పించారు. కోశాధికారి వార్షిక జమా ఖర్చులను సభకు అందజేశారు. ఎలక్షన్ కమిషనర్ వెనిగళ్ళ అమ్మాజీ ఎంపికైన నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. గౌరధ్యక్షులుగా దేవినేని జోనికుమారి, డివిజన్ సమన్వయ కర్త మహమ్మద్ హాబీబుల్లా, అధ్యక్షులుగా కె. మల్లికార్జున రావు, కార్యదర్శిగా వి వెంకటేశ్వరరావు, కోశాధికారిగా వెనిగళ్ళ మురళీమోహన్, ఉపాధ్యక్షులుగా సర్దార్ సాహెబ్, ఉప కార్యదర్శిగా ఎన్ శ్రీకాంత్‌ల చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సమావేశంలో దేవినేని కిషోర్ కుమార్, వి.మురళీమోహన్, పికె.సాంబశివరావు, స్థానిక ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్‌లు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

యథేచ్ఛగా అక్రమ మట్టి తవ్వకాలు

పట్టించుకోని రెవెన్యూ, పోలీసు అధికారులు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మండలంలో మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. రెండు రోజులుగా రేయీ, పగలనకా సాగుతున్న మట్టి తవ్వకాల ట్రాక్టర్ల రవాణా దాటికి దుమ్ముతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కొత్త చెరువును తవ్వే స్తున్నారు :

రెడ్డిగూడెం గ్రామ పంచాయతీకి చెందిన కొత్త చెరువు నుండి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా యధేచ్ఛగా రెవెన్యూ, పోలీసు స్టేషన్‌కి అతి సమీపం నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు వెళ్లుతున్నప్పటికీ పట్టించుకునే అధికారి లేకపోవడం వల్ల ఇసుక, మట్టి వ్యాపారులు చెలరేగి పోయారు. గృహ అవసరాల నిమిత్తం అంటూ మట్టి వ్యాపారం జోరుగా సాగుతుంది. ఈ అక్రమ మట్టి తవ్వకాలు, తరలింపుకు సంబంధించి ఎవరి వాటా వారిది అన్నట్టుగా ఉందని జనం చెప్పుకుంటున్నారు.

పోటాపోటీగా మట్టి తవ్వకాలు :

రెండు రోజులుగా పోటాపోటీగా మట్టి తవ్వకాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం రాత్రి వరకు అధికార పార్టీకి చెందిన గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధి విచ్చలవిడిగా అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపాడు. అనంతరం ఆదివారం ఉదయం నుంచి అధికార పార్టీకి చెందిన జెసిబి ఓనర్ తన ఇష్టం వచ్చినట్లుగా అక్రమంగా రెడ్డిగూడెం గ్రామంలో గల కొత్త చెరువు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపట్టాడు. రెవెన్యూ అధికారులు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదనే సమాధానం చెప్పి ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పోలీసులు కూడా రెవెన్యూ శాఖ వారిదే బాధ్యత అంటూ తప్పుకుంటున్నారు. అధికారులు ఇలా తమ బాధ్యతలను విస్మరించడం ఎంత వరకు సమంజసమని స్థానికులు చర్చించుకుంటున్నారు. అక్రమ మట్టి తవ్వకాలు చేపట్టిన వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణ కోసం తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి - విస్సన్నపేట : అగ్నిమాపక వారోత్సవాలు 2025వ సంవత్సరం విజయవంతంగా ఆదివారంతో ముగిశాయి. ఆఖరి రోజులో భాగంగా విస్సన్నపేట అగ్నిమాపక కేంద్ర సిబ్బంది విస్సన్నపేట అగ్ని మాపక కేంద్రంలో వివిధ రకాల అగ్ని మాపక పనిముట్లను ప్రదర్శన చేశారు. గత వారం రోజులుగా అపార్ట్‌మెంట్లు, స్కూల్స్, సూపర్ మార్కెట్లు, పెట్రోల్ బంకులు, గ్యాస్ గోడౌన్లు, హాస్పిటల్స్‌లో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ముందస్తుగా తీసుకోవలసిన జాగ్రత్తలు, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవలసిన చర్యలపై అగ్ని మాపక సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం స్థానికులతో సిబ్బందితో ప్రమాదం జరిగినప్పుడు ఎలా ఎదుర్కోవాలో డెమోలు చేసి

చూపించారు. అగ్ని మాపక వారోత్సవాలు ముగిసినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

దేవస్థానంలో బహిరంగ వేలం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :

మండలంలోని వేదాద్రి గ్రామంలో గల శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి సర్వ సంపూర్ణ హక్కు కలిగిన వేదాద్రి, రావిరాల, బండిపాలెం గ్రామంలోని కౌలు భూములు 28 బిట్లుకు గానూ మొత్తం య.160.77 సెంట్లుకు ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటల నుండి దేవాలయ ప్రాంగణంలో దేవదాయ శాఖ ఉన్నాతాధికారుల సమక్షంలో సీల్డ్ టెండరు-కం-బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుండి దేవస్థానంలో 1 సంవత్సర కాలపరిమితికి అనగా జూన్ 1, 2025 నుండి మే 31, 2026 వరకు టెంటు హౌస్/షామియానా పొంగల్ షెడ్డు నడుపుకొను లైసెన్సుకు సీల్డు టెండరు కం-బహిరంగ వేలము పాట నిర్వహించబడునని, ఆసక్తి గలవారు ధరావత్తు చెల్లించి వేలం పాటలలో పాల్గొనవచ్చని దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వెలగపూడి ఇందిరాదత్తు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు.

వృద్ధులకు సహాయం అందజేత

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండ గ్రామంలోని గ్రేస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఈస్టర్ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాచవరంలోని అమ్మానాన్న వృద్ధ ఆశ్రమంలో ఉన్న వృద్ధులందరికీ ప్లేట్లు, వాటర్ బాటిల్స్, ఫ్రూట్స్, కేకులు అందించారు. ఈస్టర్ సందర్భంగా అందరికీ భోజన ఏర్పాట్లు చేశారు. గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ డాక్టర్ మొగులూరి ఎలీషా మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో జరిగిన ఒక అద్భుతమైన సంగతి ఏసుక్రీస్తు పునరుద్దానమని, ఏసుక్రీస్తు తాను చెప్పిన విధంగానే మూడో దినమున తిరిగి లేచాడని, ఆయన పునరుద్దానుడుగా తిరిగి లేవటం వల్ల దేవుడుగా, లోక రక్షకుడిగా, విమోచకుడిగా, రుజువు అయిందని అన్నారు. క్రైస్తవ విశ్వాసానికి అతి ప్రాముఖ్యమైనది ఏసుక్రీస్తు పునరుద్దానమని అన్నారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో

ఉండాలని, ప్రపంచ దేశాల కొరకు, భారతదేశ క్షేమం కొరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ సుమలత, పెద్దలు అబ్రహం, మాణిక్యరవు అనిల్, యోబు, హరీష్, ప్రభుదాసు, డేవిడ్, సంఘస్తులు పాల్గొన్నారు.

రామకృష్ణ స్వామి గది తాళాలు తొలగింపు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం అంబరుపేట గ్రామంలో బోదానంద స్వామి ఆశ్రమం పీఠాధిపతి రామకృష్ణ స్వామి అనుమానాస్పదంగా మృతి చెందిన రెండున్నర సంవత్సరాల తరువాత ఆదివారం స్వామిజీ గది తాళాలను ఆశ్రమం కమిటీ సభ్యులు పోలీసులు, న్యాయవాదులు సమక్షంలో ఆదివారం తొలగించారు. స్వామిజీ దుస్తులు, బంగారు ఉంగరం, పలు రికార్డులు, దస్తావేజు నకళ్లు, చిల్లర నగదు, దొరికాయి. విలువైన వస్తువులు ఏమి దొరకలేదు.

ఆలయానికి విరాళం

ప్రజాశక్తి - వత్సవాయి : మండల కేంద్రమైన పెనుగంచిప్రోలులో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ దేవస్థానానికి నిత్య అన్నదానం కార్యక్రమానికి గుంటూరు జిల్లా పెదకూరపాడు మండలం అబ్బరాజుపాలెం గ్రామానికి చెందిన కర్లీ లక్ష్మణ్ సుధీర్ రెడ్డి రూ.15,116 లు విరాళంగా ఆలయ ఇన్‌స్పెక్టర్ బి.నాగరాజు చేతులు మీదుగా అందజేశారు. గోవుల సంరక్షణకు రూ.పదివేలు విరాళంగా ఇచ్చారు. ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేష వస్త్రాలతో ప్రసాదాలతో సత్కరించారు.

మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - వత్సవాయి :

కాజ్వే పైనుంచి ప్రమాదవశాత్తు మున్నేరులో పడటంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన మండల కేంద్రమైన పనిగంచిప్రోలులో చోటుచేసుకుంది. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట ప్రాంతానికి చెందిన కె.నాగేంద్రబాబు తన భార్య మనీషాతో కలిసి మైధిలి నుంచి బైక్‌పై వస్తుండగా మున్నేరు వద్ద బైకు అదుపుతప్పింది. దీంతో బైక్‌పై ఉన్న మనీషా మున్నేరులో పడిపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానిక పోలీసులు, 108 సిబ్బంది కలిసి నిచ్చెన సాయంతో పైకి రప్పించారు. 108లో జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పలుచోట్ల చంద్రబాబు జన్మదిన వేడుకలు

మచిలీపట్నంలో కేకు కట్ చేస్తున్న టిడిపి నాయకులు

అవనిగడ్డ మండలంలో కేకు కట్ చేస్తున్న విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 75వ పుట్టినరోజు వేడుకలు కృష్ణాజిల్లా వ్యాప్తంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. అన్నిచోట్ల కేక్‌లు కట్ చేసి పలుచోట్ల అన్నదానాలు నిర్వహించి ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : నారా చంద్రబాబు నాయుడు లాంటి వ్యక్తి నాయకత్వంలో పనిచేస్తుండడం ఎంతో గర్వంగా ఉందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఎన్ఆర్ఐ టిడిపి - దుబాయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నారా చంద్రబాబునాయుడు పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడారు. దేశాలు దాటి వచ్చినా సొంత గడ్డకు ఏదైనా చేయాలని తపించే ఎన్ఆర్ఐ టిడిపి విభాగం ఆధ్వర్యంలో వేడుకలు మరింత సంతోషంగా ఉన్నాయన్నారు. పి 4 కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో పేదరికం అనేది లేకుండా చేయాలని ప్రతిజ్ఞ తీసుకున్నారని కాబట్టి చంద్రబాబు విజన్ కు ఎన్నారైలు కూడా తమ వంతు సహకారం అందించాలన్నారు. అభివద్ధి మార్గంలో పయనిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్నిర్మాణంలో ఎన్ఆర్ఐలు కూడా భాగస్వాములవ్వాలని సూచించారు.

అలాగే మచిలీపట్నం పార్లమెంట్ తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏపీ ఎస్ ఆర్ టి సి ఛైర్మన్ టిడిపి జిల్లా అధ్యక్షులు, కొనకళ్ళ నారాయణరావు కేక్ కట్ చేసి నారా చంద్రబాబు నాయుడుకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ళ జగన్నాథరావు, టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్ ,మోటమరి బాబాప్రసాద్ ,గోపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి మొవ్వ** : నిడుమోలు గ్రామంలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా కేక్ కటింగ్ చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు జన్మదిన వేడుకలు శుభాకాంక్షలు తెలిపారు. మరియు మొవ్వ సెంటర్లో తాతినేని పూర్ణచంద్ర రావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కటింగ్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కూచిపూడి సెంటర్లో టిడిపి నాయకులు వీరంకి తులసీదాస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించి అనంతరం మిఠాయిలు పంచారు. **ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్** : చంద్రబాబు జన్మదిన వేడుకల సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, కష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్, గొర్రెపాటి గోపీచంద్ ఆధ్వర్యంలో పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు జరిపారు. మచిలీపట్నం మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుంచె నాని తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి మోపిదేవి** : మోపిదేవి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నడకుదుటి జనార్దన్ రావు ఆధ్వర్యంలో మోపిదేవి సెంటర్లో నిర్వహించిన కార్యక్రమంలో మోపిదేవి మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు మాతంగి వెంకటేశ్వరమ్మ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు డోకిపర్తి బాలకోటేశ్వరావు, మాజీ సిడిసి ఛైర్మన్ రావి నాగేశ్వరరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి రావి రత్నగిరి తదితరులు పాల్గొన్నారు

మోపిదేవి దేవస్థానంల ప్రత్యేక పూజలు : చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలోని నాగేంద్ర స్వామి పుట్టలో అవనిగడ్డ ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, మండలి వెంకట్రామ్ పాలు పోశారు. చంద్రబాబు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు జరిపించారు. మోపిదేవి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నడకుదుటి జనార్దన్ రావు, మాజీ సిడిసి ఛైర్మన్ రావి నాగేశ్వరరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రావి రత్నగిరి, పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద మండల టీడీపీ అధ్యక్షుడు సుదిమళ్ళ రవీంద్ర, టీడీపీ కీలక నేత తుమ్మలపల్లి హరికష్ణ, జనసేన నేత పులి కామేశ్వరరావు లు కేక్ ను కట్ చేశారు. అనంతరం అన్నసంతర్పణ ను నిర్వహించారు. ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి, సీనియర్ నేత యలమంచిలి కిషోర్ బాబుతో పాటు, రాజా, పులి శ్రీను, పచ్చిపాల రాజా, కాకుమాను రమేష్, బొర్రా వెంకట్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఘంటసాల** : కొడాలి టీడీపీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ తుమ్మల జనార్ధన రావు, టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, టీడీపీ నాయకులు పరుచూరి సుభాష్ చంద్రబోస్, వేమూరి సాయి వెంకట రమణ, పార్టీ నాయకులతో కలసి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. టీడీపీ నేతలు పరిశే చలపతి, గుత్తికొండ వరప్రసాద్, వీరంకి నాగరాజు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం** : రాష్ట్ర అభివద్ధి సీఎం చంద్రబాబు తోనే సాధ్యమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఆదివారం టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ కేక్ కట్ చేసి అందరికీ పంచారు. గన్నవరం, ఉంగుటూరు, విజయవాడ రూరల్, బాపులపాడు మండలాల నుంచి పార్టీ నాయకులు హాజరయ్యారు. **ప్రజాశక్తి-కోడూరు** : కోడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాజీ జెడ్పిటిసి సభ్యులు బండే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు జరిగాయి. తొలుత కోడూరు ప్రధాన సెంటర్లో అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేకును కూటమి నేతలు కోసి మిఠాయిలు పంచిపెట్టి భారీ బాణాసంచా కాల్చారు. బండే శ్రీనివాసరావు, గోగినేని సోమశేఖర రావు, పిల్లి మల్లికార్జునరావు, మందపాకల సాగునీటి సంఘం అధ్యక్షులు అప్పికట్ల రవీంద్రబాబు, అభిమానులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు** : మండలపరిధజలోని గరికపర్రులో మండల టిడిపి అధ్యక్షుడు వీరపనేని శివరాం ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మూడు వేల మందికి పైగా అన్నదానం చేశారు. 51 మంది రక్తదానం చేసి లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్ విజయవాడ వారికి అందించారు. చంద్రబాబు నాయుడు పుట్టినరోజు కేకు కట్ చేసి స్వీట్లు పంచారు. అలాగే పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్లకుమార్ రాజా పెళ్లిరోజు కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీటీసీ నర్ర వెంకట అప్పారావు, ఉప్పులూరి గోపాలకష్ణ, రామినేని వెంకట కుటుంబ నరసింహారావు, పాల్గొన్నారు. వల్లూరుపాలెంలో చింతపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ** : అవనిగడ్డ సెంటర్లో ఆదివారం ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి కి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రాం, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు తలసిల స్వర్ణలత ,మాజీ ఏఎంసీ ఛైర్మన్ మండ వ బాలవర్తిరావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నియోజకవర్గ పార్టీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు కేక్ కట్ చేసి ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్వీట్లు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో రోగులకు రొట్టెలు పళ్ళు అందజేశారు. ఈ కార్యక్రమంలో కర్ర సుధాకర్ మాదివాడ రత్నరావు, దాసినేని శ్రీనివాసరావు, గుంటూరు వినయ్ మేడికొండ పాల్గొన్నారు

అలాగే చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు ఘనంగా నిర్వహించారు. ఆదివారం అవనిగడ్డలోని తన కార్యాలయం వద్ద ఆత్మీయ సమావేశం పేరుతో నిర్వహించిన పుట్టినరోజు వేడుకలలో రిటైర్డ్ సి ఇ పసుపులేటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 75 కేజీల కేకును కట్ చేసి ఆయన అభిమానులకు కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అన్న సమారాధన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఐపిఎస్ అధికారి కె బాబురావు, ముమ్మారెడ్డి రామారావు, ముళ్ళపూడి నాగేశ్వరరావు, కోడూరు మాజీ ఎంపీపీ పెద్ది భాస్కరరావు తదితరులు పాల్గొనగా శ్రీనివాస్ సోదరుడు విక్కుర్తి రాంబాబు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. **ప్రజాశక్తి - గుడివాడ** : స్థానిక ఏలూరు రోడ్డులోని ప్రజా వేదికలో ఏర్పాటు చేసిన కేక్‌ను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు కట్ చేశారు. అనంతరం పార్టీ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ శిబిరాన్ని పార్టీ నేతలతో కలిసి రావి ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో రోగులకు టిడిపి నాయకులు పండ్లు పంపిణీ చేశారు. ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, సీనియర్ టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి, చేకూరు జగన్మోహన్రావు, పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల** : పమిడిముక్కల మండలంలోని హనుమంతపురం గ్రామంలో జరిగిన చంద్రబాబునాయుడు పుట్టినరోజు వేడుకల్లో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో లింగంలేని బాబురావు, కందిమల్ల సుబ్రహ్మణ్యం, గోపాలకష్ణ, కొల్లూరు బాబ్జి, కొల్లిపర బాబి తదితరులు పాల్గొన్నారు.

గన్నవరంలో వేర్వేరుగా వేడుకలు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం నియోజకవర్గ టిడిపిలో గ్రూపు విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఆదివారం సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పార్టీ సీనియర్ నాయకులు రెండు గ్రూపులుగా నిర్వహించడమే అందుకు నిదర్శనం. గత రెండు నెలలుగా పార్టీలో వెంకట్రావుకు, సీనియర్ నాయకులకు మధ్య గ్యాప్ పెరిగిపోతుంది. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న నాయకులంతా ఒక జట్టుగా ముందుకు సాగుతున్నారు. వెంకట్రావు పార్టీ నాయకులను పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడని అధిష్టానానికి ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నారు. ఎమ్మెలేకి వ్యతిరేకంగా పార్టీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.

కేకు కట్ చేస్తున్న టిడిపి సీనియర్ నాయకులు

మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జాస్తే వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో టిడిపి ఆవిర్భావం నుంచి పనిచేసిన వారంతా పాల్గొనడం విశేషం. మాజీ ఎమ్మెల్యే మూల్పూరు బాలకష్ణారావు, మూల్పూరు వెంకటరత్నం, పొట్లూరి బసవరావు, చలసాని ఆంజనేయులు, గుండపనేని ఉమా వరప్రసాద్, కంభంపాటి హేమంత కోటేశ్వరరావు, సురేష్, నాగమణి, సీనియర్ న్యాయవాది కలపాల వెంకటరమణ, మండవ లక్ష్మితో పాటు గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండలాల నుంచి పార్టీ నాయకులు యువకులు వందల సంఖ్యలో పాల్గొన్నారు.

భూదందాలకు పాల్పడితే సహించను : ఎంఎల్ఎ

మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ప్రజాశక్తి-గన్నవరం : భూదందాలకు పాల్పడే వ్యక్తులతో పాటు ప్రభుత్వ భూములు ఆక్రమించే భూ దొంగలు, అవినీతికి పాల్పడే అధికారుల భరతం పడతానని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హెచ్చరించారు. ఆదివారం గన్నవరం నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గంలో మైనింగ్ మాఫియా, భూమాఫియా, ప్రభుత్వ భూముల కబ్జాల మాఫియా ఏలుబడి గత ఐదేళ్ల కొనసాగిందని, ఇకపై అలాంటివి కుదరవని స్పష్టం చేశారు. ప్రైవేటు భూములు అక్రమంగా లాక్కున్న, ప్రభుత్వ భూముల్లో పాగావేసిన వాళ్లు ఎంత పెద్ద వాళ్ళైనా ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ప్రభుత్వ స్థలాల్లో కట్టిన కట్టడాలను కూల్చేస్తానని చెప్పారు. అధికారులు అక్రమాలను, అవినీతిని ప్రోత్సహిస్తే వారి భరతం పడతానని హెచ్చరించారు. కొంతమంది వైసీపీ నాయకులు చంద్రబాబు ఫోటోలతో హోర్డింగులు పెట్టడం చూస్తుంటే సిగ్గుగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న, మాజీ ఏఎంసీ ఛైర్మన్ కోటగిరి వరప్రసాదరావు, టిడిపి నాయకులు గొడ్డళ్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

153 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-నాగాయలంక : పర్ణశాల ప్రార్థనా మందిరం (ఘంటసాల)వారి ఆధ్వర్యంలో నాగాయలంక మండలం పర్రచివర పంచాయతీ శివారు పుల్లయ్యగారిదిబ్బ గ్రామంలోని మహిమాన్విత ప్రార్థనా మందిరంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. మచిలీపట్నంకు చెందిన వైద్యులు డాక్టర్ యక్కటి ప్రవళిక బీపీ, షుగర్, జలుబు, దగ్గు, ఆస్తమా, మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పి, దీర్ఘకాలిక వ్యాధులకు పరీక్షలు జరిపారు. సుమారు 153 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఫాస్టర్ పిఎస్.రాజు, గ్రామ పెద్దలు ఆరేవరపు నాగార్జున, కట్టా సత్యనారాయణ, దేవనబోయిన రాంబాబు పాల్గొన్నారు.

రామచంద్రరావు కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి ఘంటసాల : మన ఘంటసాల డాట్ నెట్ నిర్వాహకులు, రచయిత, ఎన్నారై వేమూరి రాజేష్ తండ్రి రామచంద్రరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు విషయం తెలిసిన ప్రభాస భారతీయులు గొర్రెపాటి రంగనాథ బాబు, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకష్ణ, గొర్రెపాటి విద్యా ట్రస్ట్ ప్రతినిధి కొండపల్లి రామకష్ణ లతో కలిసి ఆదివారం పరామర్శించారు. రామచంద్రరావు అనారోగ్య కారణాలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. రామచంద్ర రావు మృతి పట్ల సంతాపం తెలియజేసారు.

వేదిక ప్రారంభం

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలం ఈడుపుగల్లు గ్రామంలోని ఆర్‌సిమ్ చర్చి ప్రాంగణంలో 10 లక్షల రూపాయల వ్యయంతో దొప్పల జోజి జ్ఞాపకర్థం ఆయన భార్య లూర్థు మరియమ్మ వారి కుటుంబ సభ్యులు వేదికను నిర్మించారు. ఈ వేదికను ఆదివారం విజయవాడ పీఠాధిపతులు బిషప్ తెలగతోటి రాజారావు ఈస్టర్ డే సందర్భంగా ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఇడుపుగల్లు ఆర్‌సిఎం చర్చి సంఘ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

కీర్తిలాల్స్‌లో అక్షయ తృతీయ ఆఫర్లు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ వజ్రాల ఆభరణాల బ్రాండ్లలో ఒకటైన కీర్తిలాల్స్ ఈ అక్షయ తృతీయ పండుగను మరింత ప్రత్యేకంగా మార్చేందుకు ఉత్తేజకరమైన కొత్త ఆఫర్లతో ముందుకొచ్చిందని కీర్తిలాల్స్ బిజినెస్ స్ట్రాటజీ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ చెప్పారు. నగరంలోని కీర్తి లాల్ షోరూంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఇప్పటి నుండి అక్షయ తృతీయ వరకు, వినియోగదారులు వజ్రాభరణాలపై క్యారెట్‌కు రూ.20వేలు తగ్గింపు పొందవచ్చన్నారు. అక్షయ తృతీయ కొత్త ఆరంభాలకు, ముఖ్యంగా బంగారు వజ్రాల ఆభరణాల కొనుగోలుకు శుభదాయకమైన రోజుగా పరిగణించబడుతుందన్నారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని మరింత అర్థవంతంగా మార్చేందుకు, కీర్తిలాల్స్ వద్ద అత్యుత్తమ సహజ వజ్రాల సేకరణలపై సాటిలేని పొదుపులను అందించేందుకు తాము రాయితీలు అందిస్తున్నామని తెలిపారు. ప్రతి ఆభరణంతో నాణ్యత, హస్తకళ, వినియోగదారులకు అందించాలన్నదే కీర్తిలాల్స్ కట్టుబాటు, ఈ పండుగ సీజన్లో ప్రత్యేక ఆఫర్లను వినియోగదారులకు అందించగలగడం తమకు గర్వకారణంగా ఉందన్నారు. ఈ ప్రత్యేక ఆఫర్ అన్ని కీర్తిలాల్స్ స్టోర్లలో వారి అధికారిక వెబ్సైట్‌లో అందుబాటులో ఉందన్నారు. దీని ద్వారా వినియోగదారులు విలువైన బంగారు, వజ్రాల ఆభరణాల్లో పెట్టుబడి పెడుతూ అక్షయ తృతీయ పండుగను ప్రత్యేకంగా జరుపుకునే అవకాశం పొందుతున్నారని చెప్పారు.

జెవివి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - తిరువూరు : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తిరువూరు నాగార్జున ఉన్నత పాఠశాలలో ప్రతి రెండు నెలలకోసారి మూడో ఆదివారం నిర్వహిస్తున్న బిపి, షుగర్, ఫిట్స్ రోగుల రెగ్యులర్ వైద్య శిబిరానికి 1020 మంది హాజరయ్యారు. గత 12 సంవత్సరాలుగా ఇదే పాఠశాలలో నిర్వహిస్తున్న వైద్య శిబిరానికి తిరువూరు, పరిసర ప్రాంతాల జిల్లాలైన కృష్ణా, ఖమ్మం జిల్లాల నుండి కూడా హాజరైన రోగులకు వైద్యులు వి.రవీంద్ర, సత్య తేజ, లక్ష్మణరావు, శివాజీలు ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి రెండు నెలలకు సరిపడా మందులను అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపాళం శివన్నారాయణ మాట్లాడుతూ బి.పి, షుగర్ కేవలం మందుల వాడకంతోనే నియంత్రణలో ఉండవని, సరైన ఆహార నియమాలు పాటించాలని, రోజులో రెండుసార్లు మాత్రమే ఆహారం తీసుకోవాలని, ఒక్కపూట తప్పని సరిగా తృణ ధాన్యాలను వాడాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని రోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీవాహినీ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ ఎస్ఎస్ విభాగం విద్యార్థులు, మదర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ టెక్నాలజీ విద్యార్థులు జనవిజ్ఞాన వేదిక నాయకులు వాలంటీర్‌లుగా సేవలందించారు.

అమరావతి జర్నలిస్టు క్రికెట్ లీగ్ విజేత రాజధాని మీడియా

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : మూడు రోజుల పాటు జరిగిన అమరావతి జర్నలిస్టు క్రికెట్ లీగ్ టోర్నమెంట్ ముగిసింది. మొత్తం పది జట్లు ఈ టోర్నమెంట్‌లో పోటీ పడ్డాయి. నిత్యం బిజీగా ఉండే జర్నలిస్టులు క్రికెట్ క్రీడలో కూడా సత్తా చాటారు. చివరి రోజు ఆదివారం జరిగిన ఫైనల్ పోరులో అమరావతి మీడియా, రాజధాని మీడియా జట్లు తల పడ్డాయి. టాస్ గెలిచి రాజధాని మీడియా బౌలింగ్ తీసుకోగా, అమరావతి జట్టు తొలుత బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో 127 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేసిన రాజధాని మీడియా జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 15.4 ఓవర్లలో లక్ష్యాన్ని సాధించి టోర్నీ విజేతగా నిలిచింది. బహుమతి ప్రదానోత్సవ సభకు ఎంపి, ఎసిఎ అధ్యక్షులు కేశినేని శివనాథ్ చిన్ని అతిథిగా హాజరయ్యారు. విన్నర్, రన్నర్, కప్ లతో పాటు బెస్ట్ బ్యాట్స్ మెన్, బెస్ట్ బౌలర్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ కింద మెమొంటోలను అందచేశారు. ఈ సందర్భంగా కేశినేని శివనాథ్ చిన్ని మాట్లాడుతూ జర్నలిస్టులు క్రికెట్ పోటీల్లో ఉత్సాహంతో పాల్గొన్నందుకు ఏసిఎ తరపున మా ధన్యవాదాలు తెలిపారు. క్రీడాంధ్రప్రదేశ్ గా ఎపి ని మార్చాలని చంద్రబాబు ఎంతో తపన పడుతున్నారు. రాష్ట్రానికి దిశానిర్దేశం చేసేలా ఈ పోటీలు జరిగాయి. ఐపియల్ తరహాలో అమరావతి ప్రీమియర్ లీగ్ జరగడం ఆనందంగా ఉంది. క్రీడల అభివద్ధి కి మేము ఎప్పుడూ అండగా ఉంటాం. చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా జర్నలిస్టు ల ఫైనల్ మ్యాచ్ జరగడం విశేషం. సిఎం చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించిన అమరావతి జర్నలిస్టు క్రికెట్ లీగ్ పోటీల బహుమతి ప్రదానోత్సవ సభలో చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఎంపి, ఎసిఎ అధ్యక్షులు కేశినేని శివనాథ్ చిన్ని కేక్ కట్ చేసి జర్నలిస్టులకు తినిపించారు.

షార్ట్ ఫిలిం అవార్డు గ్రహీత రమణకు సత్కారం

ప్రజాశక్తి - నందిగామ : ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ తెలంగాణ రాష్ట్రం, హైదరాబాదులో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఇంటర్నేషనల్ అవార్డు షార్ట్ ఫిలిమ్స్ అంశంలో రెండు విభాగాల్లో వెంకటరమణ బెస్ట్ డైరెక్టర్ అవార్డు, బెస్ట్ షార్ట్ ఫిలిం అవార్డును అందుకున్నారు. నందిగామ టౌన్ నుంచి వెళ్లి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల డైరెక్టర్లతో పోటీపడి ఈ అవార్డులు పొందటం ఎంతో గొప్పదైన అంశమని నందిగామ ఎస్ఐ అభిమన్యు, వెంకటరమణ ను ప్రశంసించి చిరు సత్కారం చేశారు. ఇంకా మంచి ఫిల్మ్ డైరెక్టర్‌లుగా మారాలని తద్వారా నందిగామ నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఎస్ఐ అభిమన్యు ప్రశంసించారు.

వెంకట రమణను అభినందిస్తున్న ఎస్ఐ అభిమన్య

రేపు మహాప్రదర్శనను జయప్రదం చేయండి

సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ పశ్చిమ నగర గౌరవ అధ్యక్షులు సత్యబాబు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఓలా, ఉబర్, ర్యాపిడో. యాప్లను రద్దు చేయాలి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో యాప్‌లు ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివారం కొత్తపేటలోని మోటూరు హనుమంతరావు శ్రామిక భవన్లో సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా బి.సత్యబాబు, కె.సూరిబాబు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు పెద్ద ఎత్తున కొమ్ముకాస్తూ ట్రాన్స్పోర్ట్ ఆటో కార్మికులకు మొండి చేయి చూపిస్తున్నాయని అన్నారు. వాట్సాప్ పాలన పేరు చెప్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు జీవనోపాధి లభించేలా ఉచిత యాప్‌లను ఎందుకు ఏర్పాటు చేయడం లేదన్నారు పొరుగునున్న తమిళనాడు, కర్ణాటక కేరళ, రాష్ట్రాల్లో రాష్ట్ర ప్రభుత్వాలు యాప్‌లు ఏర్పాటు చేశాయి. ఆటో కార్మికులపై అధిక భారాలేస్తున్న జీవో నెంబర్ 21 రద్దు చేస్తామన్న హామీని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారంపై ఈనెల 22 ఉదయం 10 గంటలకు బిఆర్‌టిఎస్ రోడ్‌లో ఆటోలు మహాప్రదర్శనకు నగరంలో ఉన్న ఆటో కార్మికులందరూ కదిలి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర నాయకులు ఎస్.అప్పన్న, పి.సూరిబాబు, అప్పారావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సత్యబాబు, తదితరులు

రజకులకు రక్షణ చట్టం అమలు చేయాలి

ఆర్‌విఎస్ ఏడో మహాసభలో నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం ఏడో రాష్ట్ర మహాసభలు కొండపల్లిలోని డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సంఘం ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ నుండి ర్యాలీగా బయలుదేరి చిట్యాల ఐలమ్మ వేదికగా నామకరణం చేసిన బహిరంగ సభ వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఆహ్వాన సంఘం అధ్యక్షుడు చిక్కవరపు వెంకటరెడ్డయ్య అధ్యక్షత వహించారు. రాష్ట్రంలో రజకుల కు రక్షణ చట్టం అమలు చేయాలని, రజకులకు చెరువులపై పూర్తిగా హక్కులు కల్పించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రజక వత్తిదారుల సంఘం మహా బహిరంగ సభలో నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు రజకుల సమస్యలపై మాట్లాడారు. గ్రామాలలో ఉన్న చెరువులపై పూర్తిగా హక్కులు రజకులకే కల్పించాలని, సాంఘిక బహిష్కరణకు గురవుతున్న సందర్భంగా రజకులకు రక్షణ చట్టం కల్పించాలని డిమాండ్ చేశారు. రజకులకు కార్పొరేషన్ ద్వారా తగు నిధులు కేటాయించి వారికి అభివృద్ధి కేటాయించాలని డిమాండ్ చేశారు. వీటన్నింటికీ ప్రభుత్వానికి ఎటువంటి ఖర్చు ఉండదని కేవలం ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల చేస్తే సరిపోతుందన్నారు. రజకులపై పాలకులకు చిత్తశుద్ధి లేదన్నారు. పార్టీలకు అతీతంగా తమ హక్కులను కాపాడుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మున్నూరు భాస్కరయ్య, రాష్ట్ర అధ్యక్షుడు సి.గురుశేఖర్, మాజీ కార్పొరేటర్ దోనేపూడి కాశీనాథ్, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు బొలియాశెట్టి శ్రీకాంత్, తాళ్లూరు శేఖర్, కొత్తలంక శ్రీహరి, బండారు శ్రీనివాస్, బొడ్డపాటి వేణుగోపాలరావు, తుమ్మలపూడి శేఖర్, బుద్ధవరపు వెంకట్రావు, కోనేటి రాజు, మడక రాజు, వల్లభాపురం వెంకటేశ్వరరావు, లింగాల పార్వతమ్మ, లింగాల నిర్మలమ్మ, సరోజిని, పాపారావు, శ్రీహరి, శేషారావు, ప్రచార కార్యదర్శి ఈదర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ సహాయంతో మందుబాబుల గుర్తింపు

ప్రజాశక్తి - తిరువూరు : డ్రోన్ సహాయంతో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న యువకులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలి పారు. జన జీవనానికి ఇబ్బందులు కలిగే ప్రదే శాల్లో మద్యం సేవించటం నేరమని, ఇంటిలోనే తాగాలని ఎస్ఐ తెలిపారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఆధునిక వైద్య సదుపాయాలపై సెమినార్

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు వి కన్వెన్షన్ హాల్లో ఆదివారం ఆధునిక వైద్య సదుపా యాలపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. విజయవాడ సెంటినీ ఆసుపత్రి సహకా రంతో జరిపిన కార్యక్రమంలో వైద్యపరికరాల నవీకరణపై అవగాహన కల్పించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రోగులకు నాణ్యమైన సత్వర సేవలందించడంపై కూడా పలువురు వక్తలు వివరించారు. సెంటినీ ఆసుపత్రి ఎండీ మువ్వా పద్మ, డాక్టర్లు కోటేశ్వరరావు, శ్రీనివాస్ బహుదూర్, సత్య తేజ, పెనుబల్లి నాగేశ్వర రావు పలువురు వైద్యులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి - తిరువూరు : నిబంధనలను అతిక్రమించి గద్దులను అద్దెకు ఇస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సత్యనారాయణ లాడ్జీల నిర్వాహకులను హెచ్చరించారు. ఆయన సిబ్బందితో కలిసి తిరువూరు పట్టణంలోని లాడ్జీలను ఆకస్మిక తనిఖీలు చేశారు. నిబంధనల ప్రకారం మాత్రమే గదులు కేటాయించాలని, అద్దెకు తీసుకునే వారి వివరాలు పూర్తిగా నమోదు చేయడంతో పాటు వారి ఆధార్ కార్డు కూడా రికార్డు చేయాలని చెప్పారు. సాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారికి, నేర చరితులకు గదులు ఇవ్వవద్దని, అనుమానితు లు వస్తే వెంటనే పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. క్రికెట్ బెట్టింగులు, వ్యభిచారం, మాదక ద్రవ్యాల వినియోగం తదితర అవసరాలకు లాడ్జిలలో గదులు అద్దెకు ఇస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.